





Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్








సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 37 | సోమవారం 30 జూన్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## పూరీలో తొక్కిసలాట..
# ముగ్గురు మృతి

- పలువురికి గాయాలు
- రథయాత్ర నిర్వహణలో బిజెపి సర్కార్ వైఫల్యం

- మిగతా 2లో..

# నిత్యం ప్రజల్లో ఉండాలి

- ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాల్సిందే
- ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారో అదే ముఖ్యం
- ప్రజాప్రతినిధులు జనంతో అనుసంధానం కావడం దినచర్యగా మారాలి
- సిఎం చంద్రబాబు



**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 29:**

ప్రజాప్రతినిధులందరూ నిత్యం ప్రజల్లో ఉండాలని, నేతలందరూ జనంతో అనుసంధానం కావడం దిన చర్యగా మారాలని పార్టీ ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పరిశీలకులు, కార్పొరేషన్ ఛైర్మన్లకు సిఎం చంద్రబాబు సూచించారు. మనం ఏడాది పాలనలో చేసిన మేలును ప్రజలకు వివరించాలని, అదే సమయంలో వైసిపి చేస్తున్న కుట్రలను తెలియజేయాలన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సభలో జులై 2 నుంచి చేపట్టనున్న 'ఇంటింటికీ టిడిపి' కార్యక్రమంపై నేతలకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. మనం ఏమి అనుకుంటున్నామనేది ముఖ్యం కాదని, ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారనేదే ముఖ్యమన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, భవిష్యత్తులో ఏమి చేస్తామో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని చంద్రబాబు సూచించారు. వైసిపి పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కిపోయిందని, కూటమి అధికారంలోకి రాగానే విధ్వంసం నుంచి వికాసం వైపునకు రాష్ట్రాన్ని తీసుకెళుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్యేతో నిత్యం మాట్లాడతానని, రోజుకు నలుగురు ఎమ్మెల్యేలను పిలిపించి వారి లోపాలు, ఆరోపణలు,

- మిగతా 2లో..

## ఏడాదిన్నరలో
# పోలవరం పూర్తి

- ఏపీ సీఎం చంద్రబాబు
- చేసిన పనిని ప్రజలకు చెప్పడం ముఖ్యం
- భవిష్యత్తులో చేయబోయే పనులు ప్రజలకు వివరించండి
- టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ క్యాడర్ కు చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 29:**

కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టును ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని, ఎట్టిపరిస్థితుల్లోనూ 2027 లోగా ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,500 కోట్లు ఇచ్చిందని చెప్పారు. ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు.

వైసీపీ హయాంలో రాష్ట్రం ధ్వంసమైందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించారని చంద్రబాబు విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవస్థలను గాడిలో పెడుతూ, టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని

- మిగతా 2లో..



## మహా న్యూస్ పై దాడి...
# గెల్లు శ్రీనివాస్ అరెస్ట్

- మధుసూదనాచారి, బాల్క సుమన్ పై కేసు
- హైదరాబాద్‌లోని మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి
- బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అరెస్ట్
- అరెస్టును అడ్డుకున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నేత బాల్క సుమన్‌పై కేసు
- దాడి వెనుక బీఆర్ఎస్ ఉందని ఆరోపించిన కాంగ్రెస్
- ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని ప్రస్తావిస్తూ బీఆర్ఎస్‌పై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు
- దాడికి ముందు ఛానల్‌ను విమర్శిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా పోస్ట్

**హైదరాబాద్ - సూర్య వాస్తవం, జూన్ 29:**

హైదరాబాద్‌లోని ప్రముఖ తెలుగు న్యూస్ ఛానల్ 'మహా న్యూస్' కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ దాడికి సంబంధించి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను ఆదివారం అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్

- మిగతా 2లో..

# కష్టపడి పనిచేద్దాం

- మంత్రి నారా లోకేశ్
- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంపై టీడీపీ విస్తృత స్థాయి సమావేశం
- నెల రోజుల పాటు ఇంటింటి ప్రచారం చేయాలని కార్యకర్తలకు లోకేష్ పిలుపు
- ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలి
- జూలై 5 నాటికి పార్టీ సంస్థాగత కమిటీల నియామకం పూర్తి చేయాలని ఆదేశం
- కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని నేతలకు స్పష్టం
- సీనియర్లు, యువత సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలని దిశానిర్దేశం




**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 29:**

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ప్రతి ఇంటికీ తీసుకెళ్లి విజయవంతం చేయాలని ఐటీ, విద్యా శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

**టెక్నాలజీతో పనితీరు గుర్తింపు**

నెల రోజుల పాటు జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో కుటుంబ సాధికార సారథి నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుల వరకు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారం సందర్భంగా ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను 'మై టీడీపీ' యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బాగా పనిచేసిన కార్యకర్తలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించి, సత్కరించాలని తెలిపారు. "ఏడాది హనీమూన్ పూర్తయింది, ఇక అందరం కష్టపడి పనిచేయాలి" అని

- మిగతా 2లో..




## ఏపీ బీజేపీ అధ్యక్ష పదవికి
# నేడు నోటిఫికేషన్ ..

- రేసులో ఆరుగురు కీలక నేతలు
- అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు ఇవ్వనున్న రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ
- అధ్యక్ష పదవికి రేపు నామినేషన్లు దాఖలు చేయనున్న నేతలు
- జులై 1న బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నిక

2లో

# రోడ్డెక్కిన కరేడు రైతులు

- ఇండోసోల్‌కు భూములివ్వబోమని రైతన్నలు
- రోడ్డుపై బైఠాయించిన అన్నదాతలపై పోలీసుల జులుం
- మద్దతుగా వెళ్లిన నేతల అరెస్టు
- ఉలవపాడులో ఉద్రిక్తత



**ఉలవపాడు - సూర్య వాస్తవం, జూన్ 29:**

నెల్లూరు జిల్లా ఉలవపాడులో ప్రతిపాదిత ఇండోసోల్ సోలార్ పవర్ ప్రాజెక్టు ఉద్రికత్తలకు దారితీస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం బల వంతంగా భూసేకరణకు కసరత్తు చేస్తుండటంతో రైతన్నలు పోరుబాటపట్టారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ పచ్చని పంట భూములనిచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం నాడు కలకత్తా- చెన్నై జాతీయ రహదారిపై బైఠాయించి భూసేకరణకు, సోలార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. పోలీసుల ఆంక్షలను, బెదిరింపులను లెక్కచేయకుండా వేలాది మంది రైతులు ఈ ఆందోళనలో భాగస్వాములయ్యారు. రైతన్నల ఉద్యమానికి సిపిఎం, ఆప్, కాంగ్రెస్, విసివై, బిసివై పార్టీ నాయకులు మద్దతు పలికారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శనివారం నుంచే రైతులు నిరసన కార్యక్రమాలు చేపడుతు న్నారని

- మిగతా 2లో..



# విద్యావ్యవస్థ అస్తవ్యస్తం...

- ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ: జగన్
- ఈసెట్ కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం అంటూ ప్రభుత్వంపై విరుచుకుపడిన జగన్
- ఫలితాలొచ్చి 45 రోజులైనా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదని విమర్శ
- "అమాత్యా మేలుకో, పప్పూ నిద్ర వదులు" అంటూ ఘాటు వ్యాఖ్యలు

2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# నిత్యం ప్రజల్లో ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల్లో మంచి పేరు ఉందా లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అనే విషయాన్ని వివరించి వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. లోపాలను సరిదిద్దుకుని ముందుకు వెళితే మంచిదని, అలా కాకుండా వ్యవహరిస్తే అటువంటి వారికి ఓ నమస్కారం పెట్టి పక్కన పెట్టడమేనన్నారు. 2029 ఎన్నికలే తమ టార్గెట్ అని, నెలలు, రోజులు, గంటలు కూడా లెక్కిస్తున్నామని, ప్రజలకు సేవచేయడంలో పోటీ పడాలన్నారు. రాష్ట్రాన్ని ఐదు జోన్‌లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సర్వీస్ సెక్టార్, పరిశ్రమలను ప్రోత్సహించడం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనివ్వడం ప్రభుత్వ ప్రాధాన్యతలను చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం అయ్యే విధంగా అభూత కల్పనలతో దారుణంగా పోస్టింగ్‌లు పెడుతున్నారని పేర్కొన్నారు. వైసిపి నేత కారు కింద మనిషి చనిపోతే ఆయనను ఆస్పత్రికి పంపకుండా రోడ్డు పక్కన పడేశారన్నారు. రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్‌లను పరామర్శిస్తున్నారని, ఇదెక్కడి రాజకీయమని ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జులై 2 నుంచి ఇంటింటి ప్రచారం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి భాగస్వాములు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సంస్థాగత ఎన్నికలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసి పనిచేయాలని చెప్పారు.

## ఏడాదిన్నరలో
# పోలవరం పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**సుపరిపాలనలో తొలి అడుగు..**

"అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ఎన్నికల్లో దామాషా ప్రకారం అందరికీ న్యాయం చేశాం. సంక్షేమం అంటే ఏంటో చూపించిన పార్టీ మనది. చేసిన పనిని ప్రజలకు చెప్పడం ముఖ్యం. భవిష్యత్తులో ఏం చేస్తామో స్పష్టంగా చెప్పాలి" అని చంద్రబాబు పేర్కొన్నారు. పింఛన్ల పెంపు, పంటలకు గిట్టుబాటు ధర, అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు మంజూరు, వాట్సప్ గవర్నెన్స్‌తో సుమారు 500 సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు.

**కేంద్రం సహకరిస్తోంది..**

కేంద్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏపీకి సహకరిస్తోందని చంద్రబాబు చెప్పారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. స్టీల్‌ప్లాంట్‌కి రూ. 11,400 కోట్లు మంజూరు చేసిందని చంద్రబాబు చెప్పారు.

# కష్టపడి పనిచేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

చెబుతూ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

**ప్రభుత్వ విజయాలు ప్రజల వద్దకు!**

ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని లోకేశ్ అన్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 'తల్లికి వందనం' అమలు చేశామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నామని గుర్తుచేశారు. అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, ఇచ్చిన ప్రతి హామీని పద్ధతి ప్రకారం నెరవేర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని తెలిపారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు.

**పార్టీయే సుప్రీం.. కార్యకర్తలే బలం**

2024 ఎన్నికల్లో ఊహించని విజయం వెనుక కార్యకర్తల కష్టం ఎంతో ఉందని లోకేశ్ కొనియాడారు. క్లస్టర్, యూనిట్, బూత్ (కబ్) వ్యవస్థ వల్లే పార్టీ క్షేత్రస్థాయిలో బలపడిందని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేధింపులు, అక్రమ కేసులు ఎదుర్కొని, జైళ్లకు వెళ్లిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ మరువద్దని ఎమ్మెల్యేలు, మంత్రులకు సూచించారు. పార్టీయే సుప్రీం అని, ప్రపంచం మొత్తం తిరిగినా మనందరం తిరిగి వచ్చేది దేవాలయం లాంటి పార్టీ కార్యాలయానికే అని ఆయన ఉద్ఘాటించారు.

**సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి**

పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలని లోకేశ్ ఆదేశించారు. జూలై 5వ తేదీలోగా క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలతో పాటు అనుబంధ విభాగాల నియామకాలు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. మహిళలను ప్రోత్సహించేందుకు 'కబ్' వ్యవస్థలో కో-కన్వీనర్ పదవిని సృష్టించామని, కమిటీలలో మహిళలు, యువతకు పెద్దపీట వేయాలని సూచించారు. నియోజకవర్గాల్లో సంస్థాగత నిర్మాణంపై ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కుప్పంలో చంద్రబాబు వరుస విజయాలకు ఇదే కారణమని గుర్తుచేశారు.

**సీనియర్లు, యువత సమన్వయం**

పార్టీకి నాలుగు దశాబ్దాలుగా సీనియర్లు అండగా నిలిచారని, వారి అనుభవాన్ని విస్మరించకూడదని లోకేశ్ అన్నారు. సీనియర్ల అనుభవాన్ని, యువత శక్తిని జోడించి పార్టీని ముందుకు నడపాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పార్టీ పదవుల పంపిణీలో అందరినీ కలుపుకొనిపోతూ దామాషా పద్ధతి పాటించాలని సూచించారు. నియోజకవర్గాల్లో బాగా పనిచేసిన వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

# పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి

**- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి**

**- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్**

**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 29:** ప్రజా సమస్యల పరిష్కారానికి నేతలు కృషి చేయాలని, మంచి పనులు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పార్టీ శ్రేణులకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జులై 5 నాటికి పార్టీ కమిటీలన్నింటినీ పూర్తి చేయాలన్నారు. డోర్ టు డోర్ ఫీడ్ బ్యాక్‌ను ప్రజల నుంచి తీసుకుని టిడిపి యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. జులై 2 నుంచి నెల రోజులు చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలు, నేతలకు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా తల్లికి వందనం అమలు చేశామని, ఎన్నికల్లో తామిచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దయెత్తున భాగస్వాముల్ని చేస్తామని, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. సీనియర్ల సహకారంతో యువతకు ఉన్న శక్తిని జోడించాలని, ప్రతి జిల్లా, నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాలను అన్ని ప్రాంతాల్లో నిర్మించాలన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం బాగా చేసిన వారిలో మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నారన్నారు. బాగా పనిచేసిన కార్యకర్తలను సత్కరించాలన్నారు.

## పూరీలో తొక్కిసలాట..
# ముగ్గురు మృతి

**భువనేశ్వర్ - సూర్య వాస్తవం, జూన్ 29:**

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో మరోమారు విషాదం చోటుచేసుకుంది. పూరీ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం గుండీచా దేవాలయం వెలుపల జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 50 మంది పైగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రుల కు ఒడిషా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జీ వ్యక్తిగతంగా, ప్రభుత్వం తరపున క్షమాపణ చెప్పారు. భద్రతా ఏర్పాట్లలో జరిగిన వైఫల్యాలపై విచారణకు ఆదేశించారు. పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ ఎస్ స్వియాన్, పోలీస్ సూపరింటెండెంట్ బినిత్ అగర్వాల్‌ను బదిలీ చేశారు. పూరీ సిడిపి విష్ణు చరణ్ పాటి, పోలీస్ కమాండెంట్ అజరు పథిని సస్పెండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. కాగా తొక్కిసలాటలో మరణించిన వారిని బసంతి సాహు (బోలాగర్భ్), ప్రేమకాంత్ మొహంతి, ప్రవతి దాస్ (బాలిపట్న)గా గుర్తించారు. రథయాత్ర నిర్వహణలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివిపిలకు ప్రోటోకాల్ కల్పించడంలోనే అధికార యంత్రాంగమంతా మునిగితేలిందని బాధితుల బంధువులు తప్పుబట్టారు. ప్రోటోకాల్ ఆంక్షలే తమవాళ్ల ప్రాణాలు తోడేశాయని వాపోయారు.

పోలీసులంతా వివిఐపిల భద్రతకు వెళ్లిపోయారని, జనాలను నియంత్రించేందుకు ఎవ్వరూ లేకపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని వారు పేర్కొన్నారు. రద్దీ నేపథ్యంలో శనివారం రాత్రి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయడంతో గందరగోళం నెలకొంది. ఆ తర్వాత భక్తులను ఒక్కసారిగా లోపలికి అనుమతించడంతో తొక్కిసలాట జరిగింది. దీనికితోడు రథాలను దగ్గర దగ్గరగా ఉంచడంతో పరిస్థితి అదుపు తప్పింది. శనివారం రాత్రి పోలీసుల జాడే కన్పించలేదని, దీంతో ప్రజలను అదుపు చేయడం సాధ్యపడలేదని మృతుల బంధువులు పేర్కొన్నారు. కాగా పలువురు బిజెపి మంత్రులు తమ బంధువులు, స్నేహితులను రథాల చెంతకు తీసుకుపోవడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. రథయాత్రలో ఈ నెల 27న కూడా తొక్కిసలాట లాంటి పరిస్థితులు, భారీ ఉష్ణోగ్రతల కారణంగా 600 మంది పైగా అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలైన సంగతి విదితమే. రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకునే బిజెపి ప్రభుత్వం ఒడిశా ప్రజలు ఎంతో ఆరాధించే జగన్నాథ రథయాత్రను కూడా సరిగా నిర్వహించలేకపోవడం దారుణమని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విమర్శించారు.

భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట జరిగిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. మృతులకు తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## మహా న్యూస్ పై దాడి...
# గెల్లు శ్రీనివాస్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు వెల్లడించారు. అంతేకాకుండా, ఆయన అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీ బాల్క సుమన్‌పైనా కేసు నమోదు చేశారు.

**పోలీసుల విధులకు ఆటంకం**

శనివారం జూబ్లీహిల్స్‌లోని మహా న్యూస్ కార్యాలయంపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను అరెస్ట్ చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు వెళ్లారు. ఆ సమయంలో మధుసూదనాచారి, బాల్క సుమన్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో వారిపై మరో కేసు నమోదు చేశారు. దాడి ఘటనలో నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసులు బుక్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

**దాడిని ఖండించిన కాంగ్రెస్**

ఈ దాడిని అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం మహా న్యూస్ కార్యాలయాన్ని సందర్శించి, జర్నలిస్టులు, సిబ్బందికి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ దాడి వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందని ఆరోపించారు. తమ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ పాపం బయటపడుతుందనే భయంతోనే బీఆర్ఎస్ ఇలాంటి దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్‌కు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరిగే అవకాశం లేదని, ఈ అంశంపై కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

"రాజకీయ నాయకుల ఫోన్లే కాకుండా, వారి కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, మహిళా అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. దీనివల్ల ఎన్నో కుటుంబాల్లో చిచ్చు పెట్టారు," అని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత మీడియాకు ఉందని, తమపై పెయిడ్ ఛానళ్లలో ఎన్నో వ్యతిరేక కథనాలు వచ్చినా తాము ఎప్పుడూ భౌతిక దాడులకు దిగలేదని ఆయన స్పష్టం చేశారు. కేటీఆరే స్వయంగా గూండాలను రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు.

**జర్నలిస్టుల ముసుగులో...**
**అంటూ కేటీఆర్ సోషల్ మీడియా పోస్ట్**

దాడి జరగడానికి ముందు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సదరు ఛానల్ ప్రసారం చేసిన ఒక బులెటిన్‌ను విమర్శిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. "జర్నలిస్టుల ముసుగులో ఉన్న కొందరు నీచులు గత కొన్ని నెలలుగా నాపైనా, మా పార్టీ నాయకత్వంపైనా విషం చిమ్ముతున్నారు. వారి అభిప్రాయాలను నేను పట్టించుకోను. కానీ, పదేపదే వ్యక్తిత్వ హననానికి పాల్పడటం నా కుటుంబం, స్నేహితులు, పార్టీ శ్రేణులను బాధిస్తోంది.

ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. ఈ వ్యవస్థీకృత దాడుల వెనుక ఎవరున్నారో నాకు బాగా తెలుసు, వారితో తగిన రీతిలో వ్యవహరిస్తాను" అని కేటీఆర్ తన పోస్టులో హెచ్చరించారు. ఈ పోస్ట్ చేసిన కొద్దిసేపటికే దాడి జరగడం గమనార్హం.



# రోడ్డెక్కిన కరేడు రైతులు

(మొదటి పేజీ తరువాయి)

తెలియడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పదుల సంఖ్యలో రైతులను, ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అడుగడుగునా ఆంక్షలు విధించారు. జాతీయ రహదారిపై ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేయడానికి వీల్లేదని హెచ్చరించారు. కరేడు గ్రామం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో బలగాలను మోహరింపజేశారు. పోలీసుల ఆంక్షలను అధిగమించి అన్నదాతలు జాతీయ రహదారి చేరుకొని ఆందోళన చేపట్టారు. కరేడు, ఆ చుట్టుపక్క గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రైతుల పోరాటానికి మద్దతుగా వెళ్తున్న సిపిఎం నాయకులు ఇ వెంకటేశ్వర్లు, కుమార్, టి మాల్యాద్రి, ఆప్ కన్వీనర్ నేతి మహేశ్వరరావుతో పాటు సుంకర పద్మశ్రీ (కాంగ్రెస్), రామచంద్రయాదవ్ (భారత చైతన్య యువజన పార్టీ), సామాజిక వేత్త కె వసుంధర తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. రామచంద్రయాదవ్ కరేడు గ్రామం నుంచి ర్యాలీగా జాతీయ రహదారికి వస్తుండగా రామకృష్ణపురం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆయన మరో మార్గంలో జాతీయ రహదారికి చేరుకుని ఆందోళనలో పాల్గొన్నారు.

పచ్చని పంట పొలాలను ప్రయివేటు ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు ఇవ్వబోమని రహదారిపై రైతులు భీష్మించారు. రైతన్నల ఆందోళనతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రయాణికుల ఇబ్బందులను సాకుగా చెబుతూ వెంటనే రహదారిని ఖాళీ చేయాలని పోలీసులు రైతన్నలపై జులుం ప్రదర్శించారు. రైతు సంఘాల నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అయినా అన్నదాతలు తమ ఆందోళన కొనసాగించడంతో ప్రభుత్వ యంత్రాంగం దిగొచ్చింది. సబ్‌కలెక్టర్ శ్రీపూజ అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. తగిన న్యాయం చేస్తామని, ఆందోళన విరమించాలని రైతులను కోరారు. పచ్చని పంట పొలాలు, భూములను తాము ఇవ్వలేమని, ఆ భూములు కావాలంటే మా శవాలు మీద నుంచి వెళ్లాల్సివుంటుందని రైతులు తేల్చి చెప్పారు. ఇండో సోల్ సోలార్ ప్రాజెక్టుకు 8348 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సబ్‌కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయాక పోలీసులు మళ్లీ రైతన్నలపై జులుం ప్రదర్శించారు. ఆందోళనకారులకు మద్దతుగా వెళ్లిన సిపిఎం, ఆప్, కాంగ్రెస్, విసివై, బిసివై నాయకులు మూలం రమేష్, సుంకర పద్మశ్రీ, రామచంద్రయాదవ్, సామాజిక వేత్త కె. వసుంధర తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి కందుకూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అన్నదాతలను అక్కడి నుంచి చెదరగొట్టారు. అరెస్టు చేసినవారిని సిపిఎం నాయకులు మౌలం రమేష్, ఎం పుల్లయ్య, పి పెంచలయ్య పరామర్శించారు. కేసు నమోదు చేసిన అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

# విద్యావ్యవస్థ అస్తవ్యస్తం...

**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 29:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, అందుకు ఏపీ ఈసెట్ అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యమే నిదర్శనమని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫలితాలు వెలువడి నెలన్నర రోజులు గడుస్తున్నా ఇంతవరకు కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ అని విమర్శించారు. ఈసెట్ ఫలితాలు గత నెల మే 15వ తేదీన వెలువడినా, నేటికీ అడ్మిషన్ల ప్రక్రియపై ఎలాంటి షెడ్యూల్ విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎంత దారుణంగా అస్తవ్యస్తంగా మారిందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలని ఆయన అన్నారు. రేపటి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానుండగా, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన "అమాత్యా మేలుకో.. పప్పు నిద్ర వదులు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 34 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షకు హాజరుకాగా, వారిలో 31,922 మంది అర్హత సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంతమంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని జగన్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# డైట్ ఛార్జీల పెంపునకు కృషి : మంత్రి సవిత

**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 29:** హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీల పెంపునకు కృషి చేస్తానని బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాజా ఆహారాన్ని మాత్రమే అందించాలని అధికారులకు సూచించారు. బిసి సంక్షేమశాఖ మంత్రిగా ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా బిసి వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం ప్రతినిధులు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఆదివారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో, ఇప్పటికే ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీరు మాత్రమే అందించాలన్నారు. విద్యార్థులకు జలుబు, తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే అందుబాటులో ఉన్న వైద్యులతో వైద్య సేవలందించాలని సూచించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. డైట్ ఛార్జీల పెంపు విషయం ఇప్పటికే సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. బిసి సంక్షేమ శాఖలో ఖాళీల భర్తీ, పదోన్నతులు తదితర అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, గౌరవాధ్యక్షులు దయానందరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీను, సాగర్ తదితరులు ఉన్నారు.



## సంపాదకీయం

### రాజధాని స్టాండ్ మారలేదా... - వైసీపీలో మళ్లీ చర్చ



వైసీపీ అధినేత జగన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటారా? అంటే లేదనే తెలుస్తుంది. రాష్ట్రం మరోసారి విభజన కాకుండా ఉండాలంటే మూడు రాజధానులు అవసరమని ఇప్పటికీ జగన్ నమ్ముతున్నారు. గత ఎన్నికలకు మూడు రాజధానుల నినాదంతోనే వైఎస్ జగన్ వెళ్లారు. అయితే మూడు ప్రాంతాల ప్రజలు జగన్ పార్టీని ఆదరించలేదు. దీంతో రాజధాని అమరావతి అంశం మూడు ప్రాంతాల్లో పనిచేసిందని వైసీపీ నేతలు కూడా నమ్ముతున్నారు. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాలకు చెందిన వైసీపీ నేతలు అమరావతిని రాజధానిగా కొనసాగిస్తే గెలిచే వారమని చెబుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ వంటి వారయితే మూడు రాజధానుల కథ ముగిసిందన్నట్లుగా మాట్లాడారు. అయితే గత ఎన్నికల్లో వైసీపీ దారుణంగా దెబ్బతినడానికి అమరావతి కారణం కాదని జగన్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. అమరావతి రాజధాని అంశమే ప్రధానంగా మారితే ఇటు రాయలసీమ, అటు ఉత్తరాంధ్రలో ఎందుకు ఊడ్చుకుపోతామని ఎదురు ప్రశ్నిస్తున్నారట. అసలు గత ఎన్నికలలో ఓటమికి అమరావతి కారణం మాత్రం కాదని, ఓట్ల శాతం ఒక్కసారిగా పెరగడంతో పాటు ఈవీఎంల వల్లనేనని జగన్ ఇప్పటికీ అభిప్రాయపడుతున్నారని తెలిసింది. చంద్రబాబు నాయుడు కేవలం అమరావతి రాజధానికి మాత్రమే నిధులు ఖర్చు చేయడంతో పాటు సంక్షేమ పథకాలను కూడా అమలు చేయకపోవడం, ఇచ్చిన హామీలు కూడా అందచేయకపోవడం తమకు కలసి వస్తుందని అంటున్నారట. రాజధానిలో వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడమే కాకుండా, అక్కడ దశల వారీగా అభివృద్ధి చేయాల్సిన సమయంలో ఒక్కసారి అప్పులు చేసి నిధులు కుమ్మరించడాన్ని కూడా ఇతర ప్రాంతాల ప్రజలు తప్పుపడుతున్నారని జగన్ సీనియర్ నేతల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అందుకే వెన్నుపోటు దినం పిలుపు నిస్తే రాష్ట్రం నలుమూలల ఉత్తరాంధ్ర, రాయలసీమలోని అన్ని ప్రాంతాల్లో కార్యకర్తలు, ప్రజలు వెల్లువెత్తడానికి కూడా కారణం ప్రభుత్వం పెల్లుబుకుతున్న అసంతృప్తి మాత్రమేనని అంటున్నారట. వచ్చే ఎన్నికల్లో కూడా అమరావతి రాజధాని అని మ్యానిఫెస్టోలో పెట్టే అవకాశం మాత్రం కనిపించడం లేదు. అయితే అదే సమయంలో రాజధాని ప్రస్తావన లేకుండానే ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న అభిప్రాయంలో ఉన్నారని తెలిసింది... రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఎన్ని నిధులు వెచ్చించినా నాలుగేళ్లలో పనులు పూర్తి కావని, అయితే కొన్ని కీలక సంస్థలను మాత్రం ఇతర ప్రాంతాలకు తరలించడంతో పాటు రాజధానికి మరో నలభై వేల ఎకరాలను సేకరించడం కూడా అనవసరమన్న అభిప్రాయంలో వైఎస్ జగన్ ఉన్నారని చెబుతున్నారు. రాజధాని అంశంపై ఎవరూ మాట్లాడవద్దని కూడా సీనియర్ నేతలకు జగన్ సూచించినట్లు తెలిసింది. దీనిపై పార్టీ స్టాండ్ తాను మాత్రమే ప్రకటిస్తానని, అది అందరికీ ఆమోదయోగ్యంగానే ఉంటుందని చెబుతున్నారు. అంతే తప్ప ఇప్పుడు ప్రచారం జరుగుతున్నట్లు మూడు రాజధానుల నుంచి వెనక్కు మళ్లారని మాత్రం అనుకోవద్దని కూడా జగన్ చెబుతుండటం విశేషం.

## 345 పార్టీల తొలగింపు





**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సంఘం నుంచి రాజకీయ పార్టీగా గుర్తింపు పొంది..2019 నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా జరిగిన ఎలాంటి ఎన్నికలలో పోటీ చేయని 345 పార్టీలను.. రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించేందుకు సిద్ధమైంది. ఈ ప్రక్రియను త్వరలోనే ప్రారంభించబోతున్నట్టు ఎన్నికల సంఘం పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సంఘం నుంచి రాజకీయ పార్టీగా గుర్తింపు పొంది..2019 నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా జరిగిన ఎలాంటి ఎన్నికలలో పోటీ చేయని పార్టీలను.. రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించేందుకు సిద్ధమైంది. ఇలా గత ఆరేళ్లుగా ఏ ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయకుండా, ఎన్నికల సంఘం ముఖ్యమైన షరతును నెరవేర్చడంలో 345 రాజకీయ పార్టీలు విఫలమైనట్లు ఈసీ తెలిపింది.పార్టీలు గత కొంత కాలంగా కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, దేశవ్యాప్తంగా ఎక్కడా తమ కార్యాలయాలను కూడా జరపలేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సదరు పార్టీలను రాజకీయ పార్టీల జాబితా నుంచి తొలగించే అంశంపై నిర్ణయం తీసుకోనున్నా?టు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 2,800కు పైగా గుర్తింపు లేని పార్టీలు ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయ్యి ఉన్నాయని ఈసీ పేర్కొంది. వీటిని తొలగించే ప్రక్రియను త్వరలోనే ప్రారంభించనున్నట్టు ఈసీ తెలిపింది.ఓటరు జాబితాలో అక్రమంగా చేరిన వారు, విదేశాల నుంచి వలస వచ్చిన వారు, మరణించి నవారి పేర్లు తొలగించడానికి కొత్తగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ప్రారంభించింది ఈ నేపథ్యంలో, ఓటుగా నమోదు కావాలంటే పుట్టిన తేదీ, జన్మించిన ప్రదేశాన్ని రుజువు చేసే ధ్రువపత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ చర్యలు భారత పౌరసత్వ చట్టం, 1955లో పేర్కొన్న నిబంధనల ఆధారంగా తీసుకున్నవిగా ఈసీ స్పష్టం చేసింది. ఈసీ తెలిపిన ప్రకారం, గతంలో ఇంటెన్సివ్ రివిజన్ చివరిసారిగా 2003లో జరిగింది. అయితే, అప్పటి నుంచి దేశంలో పెద్ద ఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త ఓటర్లు వచ్చారు, చాలా మంది వలసబాటపట్టారు. కొందరి మరణాలు అధికారికంగా నమోదు కాలేదు. కొన్ని చోట్ల అక్రమ వలసదారులు ఓటర్ల జాబితాలో చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి ఇంటెన్సివ్ రివిజన్ ప్రాధాన్యత పెరిగింది. ఇది కేవలం ఓటర్ల జాబితా పరిశుద్ధతకే కాకుండా, ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని పెంచే మార్గంగా కూడా కనిపిస్తోంది.

## చంద్రబాబు వ్యాఖ్యలు..
# విశ్వాసం పెంచేందుకేనా.?

**విజయవాడ - సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫుల్లు కాన్ఫిడెన్స్ లో ఉన్నారు. ఆయన ఎక్కడకు వెళ్లినా ఒక మాట మాత్రం ఖచ్చితంగా చెబుతున్నారు. మళ్లీ ఆ భూతాన్ని రానివ్వనంటూ వివిధ వర్గాల వారికి హామీ ఇస్తున్నారు. అంటే జగన్ ఇక జన్మలో ముఖ్యమంత్రి కారని చంద్రబాబు ఫిక్స్ అయినట్లే కనిపిస్తుంది. తాజాగా ఫిక్కీ సమావేశంలోనూ జగన్ పేరు ఎత్తకుండా ఆ భూతాన్ని మళ్లీ రానివ్వనని, నాది హామీ అంటూ పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. కొత్త రాష్ట్రంలోనూ, నూతన రాజధానిలోనూ పెట్టుబడులు సమకూరాలంటే ఖచ్చితంగా అలాంటి హామీ ఇవ్వాల్సిందేనని, అందుకే చంద్రబాబు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండ ఉండి ఉండవచ్చు అన్న విశ్లేషణలు వినపడుతున్నాయి.. రాకుండా అడ్డుకోవడానికి చంద్రబాబు వల్ల సాధ్యం కాదు. కాకపోవచ్చు కూడా. అధికార పార్టీ అది ఏదైనా.. వైసీపీ అయినా టీడీపీ అయినా మరొకటి అయినా ప్రజలు మార్పు కోరుకుంటారు. రానివ్వకుండా ఉండేది ఓటర్లు మాత్రమేనని వైసీపీ నేతలు అంటున్నారు. చంద్రబాబు చేసే పనులను ప్రజలు గమనిస్తున్నారని, ఏడాదిలోనే ఒక ప్రభుత్వంపై ఇంతటి వ్యతిరేకత వ్యక్తమవ్వడం ఎక్కడా చూడాలేదని వైఎస్ జగన్ సాక్షాత్తూ వ్యాఖ్యానించారు. అధికార పార్టీపై సహజంగా వ్యతిరేకత ఉంటుంది. ఎంత మంచి చేసినా కొందరికే అందుతుంది. మిగిలిన వారిలో అసంతృప్తి రగులుతుంది. మరొకవైపు ఎమ్మెల్యేలపై పెరిగే అసంతృప్తి ఎన్నికల సమయానికి కాని తెలియదు.. వైసీపీ అధినేత జగన్ కూడా ఆ అసంతృప్తిని గమనించి చాలా మంది ఎమ్మెల్యేలను మొన్నటి ఎన్నికల్లో నియోజకవర్గాలనే మార్చారు. మంత్రులను కూడా వదిలిపెట్టకుండా షిఫ్ట్ చేసేశారు. అయినా అలా మార్చిన వారిలో ఎవరూ గెలవకపోవడం ఇక్కడ చూడాలి. ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును కూడా ప్రజలు బేరీజు వేసుకుంటారు. ఏపీ ఎన్నికలు పార్లమెంటు, అసెంబ్లీ ఒకేసారి జరుగుతాయి కాబట్టి తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం పనితీరు ప్రభావం కూడా కొంత పడుతుంది. అది అడ్వాంటేజిగా మరుతుందా? లేక అదే ఇబ్బందిగా తలెత్తుతుందా? అన్నది ఫలితాల తర్వాత మాత్రమే తేలుతుంది. అంతే కాని నేతల చేతుల్లో ఒకరి గెలుపును అడ్డుకోవడమంటే ఇప్పటికీ కొందరే దశాబ్దాల నుంచి ముఖ్యమంత్రులుగా చెలామణి అయ్యేవారు. తమిళనాడు వంటి రాష్ట్రంలో బీజేపీ ఇప్పటి వరకూ కాలుమోపకపోవడాన్ని కూడా ఉదహరిస్తున్నారు. అది ఎన్ని ట్రిక్కులు ప్లే చేసినా చివరకు తమిళనాడు విషయానికి వచ్చేసరికి రాజకీయంగా ఇబ్బంది పడుతుంది. అక్కడ పొత్తులు కూడా పనిచేయడం లేదు. తెలంగాణలోనూ సుదీర్ఘకాలం నుంచి చేస్తున్న పోరాటం విజయం వైపు నడవలేదు. మహారాష్ట్రలో ఒకసారి బీజేపీని కూడా కాదని అక్కడ కాంగ్రెస్ కూటమికి ప్రజలు పట్టం కట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అందుకే నేతల చేతుల్లో ఒకరి గెలుపు ఆపడం సాధ్యపడదని, అయితే ఆ మాత్రం నమ్మకం లేకపోతే ముందుకు వెళ్లలేక అలా చెప్పుకుంటూ వెళతారన్న విశ్లేషణలు విన పడు తున్నాయి. మూడు పార్టీలు కలిసినా విజయం సాధిస్తాయన్న నమ్మకం ఉండదు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత మూడు పార్టీలపై పడుతుంది. నిరుద్యోగులకు అసలైన పండగ అందరూ కార్యకర్తలకు... తెలంగాణలో వరసగా రెండు సార్లు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడోసారి కూడా తమదే విజయమని కేసీఆర్ ధీమాగా ఉన్నారు. తానే శాశ్వత ముఖ్యమంత్రి భ్రమించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను పెద్దగా మార్పు చేయకుండానే ఎన్నికలకు వెళ్లి చేతులు కాల్చుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇక కార్యకర్తలకు అందరికీ న్యాయం జరగదు. ఏ పార్టీ అయినా కొందరికే వారి అవసరాలను తీర్చగలుగుతుంది. స్థానిక ఎమ్మెల్యేలు కూడా వేల సంఖ్యలో ఉన్న ముఖ్యమైన కార్యకర్తలను మెప్పించడం ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదు. అందుకే కార్యకర్తలు కూడా ప్రతి ఎన్నికల్లో తమ వైఖరిని మార్చుకుంటారన్న రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి. మరి భూతాన్ని రానివ్వనన్న ధైర్యం చంద్రబాబు లో రావడానికి కారణమేంటో మాత్రం తెలియదు.

## కరాచీ టూ ఇండియా...వయా దుబాయ్...

**ముంబై - సూర్య వాస్తవం**



పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. భారత ప్రభుత్వం పాకిస్థాన్‌పై పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఎన్ని ఆంక్షలు ఉన్నప్పటికీ.. పాక్‌తో కొంతమంది దొంగతనంగా వ్యాపారం సాగిస్తున్నారు. తాజాగా నవీ ముంబైలోని పోర్టులో ఓ భారీ షిప్ వచ్చింది. అందులో ఏకంగా 39 భారీ కంటైనర్లు పాకిస్థాన్‌కు చెందినవిగా అధికారులు గుర్తించారు. పూర్తి వివరాలు చూస్తే.. అక్రమ వ్యాపారం నియంత్రణలో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ నవీ ముంబైలోని నవా షెవా ఓడరేవులో పాకిస్తాన్ నుండి వచ్చిన వస్తువులతో నిండిన 39 కంటైనర్లను స్వాధీనం చేసుకుంది. 1,115 మెట్రిక్ టన్నులు ఉన్న ఈ కంటైనర్లు సుమారు రూ. 9 కోట్ల విలువైనవిగా అధికారులు అంచనా వేశారు. పాకిస్తాన్ నుండి దిగుమతి చేసుకుంటున్న నిషేధిత వస్తువులను థర్డ్ పార్టీ కంట్రీస్ నుంచి ఇండియాలోకి దిగుమతి చేసుకునే ప్రయత్నం జరిగింది. ప్రధానంగా దుబాయ్, యూఏఈ ద్వారా అడ్డుకునేందుకు “ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్” అనే కోడ్‌నేమ్‌తో కూడిన ఈ హై-స్టేక్స్ ఆపరేషన్ ప్రారంభించారు అధికారులు. ఈ ఆపరేషన్‌లో భాగంగానే ఈ కంటైనర్లు పట్టుబడ్డాయి.ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన ప్రకారం.. స్వాధీనం చేసుకున్న వస్తువులు భారతదేశ దిగుమతి విధానాన్ని స్పష్టంగా ఉల్లంఘించాయి, ఇది పాకిస్తాన్ మూలాల ఉత్పత్తులను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దిగుమతి చేసుకోవడం, రవాణా చేయడాన్ని స్పష్టంగా నిషేధిస్తుంది. దిగుమతి చేసుకునే సంస్థ భాగస్వాములలో ఒకరిని గురువారం అరెస్టు చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. పహల్గామ్ ఉగ్రవాద దాడుల తర్వాత, ప్రభుత్వం మే 2, 2025 నుండి పాకిస్తాన్‌లో ఉత్పత్తి అయిన లేదా ఎగుమతి చేసిన వస్తువుల ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దిగుమతి చేసుకోవడం లేదా రవాణా చేయడంపై సమగ్ర నిషేధం విధించింది. గతంలో, అటువంటి వస్తువులు 200 శాతం కస్టమ్స్ సుంకానికి లోబడి ఉండేవిఅయితే ఇన్ని కఠినమైన ఆంక్షలు ఉన్నప్పటికీ కొంతమంది దిగుమతిదారులు వస్తువుల మూలాన్ని తప్పుగా పేర్కొని, సంబంధిత షిప్పింగ్ పత్రాలను తారుమారు చేస్తూ ప్రభుత్వాన్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆరోపించింది. “రెండు వేర్వేరు సందర్భాలలో ఈ సరుకులను నవా షెవా పోర్టులో స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకులను జంఇ-మూలం అని తప్పుగా పేర్కొన్నారు. కానీ, నిజానికి అవి పాకిస్థాన్ వస్తువులు. భారతదేశంలోకి దిగుమతి చేసుకోవడానికి దుబాయ్ నుంచి వచ్చాయని దర్యాప్తులో తేలింది” అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటనలో పేర్కొంది.దర్యాప్తులో ఈ వస్తువులను మొదట పాకిస్తాన్ నుండి దుబాయ్‌కు ఒక సెట్ కంటైనర్లు, ఓడలపై రవాణా చేశారని, ఆ తర్వాత భారతదేశానికి వెళ్లే మరొక సెట్ కంటైనర్లు, ఓడలకు బదిలీ చేశారని తేలింది. ఇప్పటివరకు నిర్వహించిన దర్యాప్తులో సేకరించిన పత్రాల విశ్లేషణ, వస్తువులను మరింత పరిశీలించినప్పుడు పాకిస్తాన్‌లోని కరాచీ ఓడరేవు నుండి కార్గో తరలింపు మార్గాలు, దుబాయ్‌లోని జాబెల్ అలీ ఓడరేవు వద్ద భారత ఓడరేవులకు వెళ్లే మార్గంలో ట్రాన్స్‌షిప్‌మెంట్‌లు బయటపడ్డాయి. పాకిస్తాన్ సంస్థలతో డబ్బు బదిలీలు/ఆర్థిక సంబంధాలను కూడా అధికారులు గుర్తించారు. ఇది అక్రమ ఆర్థిక ప్రవాహాల గురించి తీవ్రమైన ఆందోళనలను రేకెత్తించింది. “ఈ మొత్తం కార్యనిర్వహణ విధానం పాకిస్తాన్, యూఏఈ జాతీయులతో కూడిన సంక్లిష్టమైన లావాదేవీల వెబ్ ద్వారా నిర్వహించారు. ఇది వస్తువుల నిజమైన మూలాన్ని, అంటే పాకిస్తాన్‌ను అస్పష్టం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది” అని ఆర్థిక మంత్రిత్వ శాఖ జోడించింది.

## అమరగానం... ఏమైంది...

**విశాఖపట్టణం- సూర్య వాస్తవం**

వైసీపీలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విపక్షాలపై ఒంటికాలు మీద లేచే గుడివాడ అమర్ నాథ్, ఇప్పుడు నోటికి అచితూచి పని చెబుతున్నారట. అసలు మీడియా ముందుకు రావడానికి కూడా ఇష్టపడట్లేదట. వైసీపీ ఘోర పరాజయం తర్వాత పార్టీ తరఫున మీడియా ముందుకు వచ్చి వాయిస్ వినిపించే అతి కొద్దిమంది నేతల్లో గుడివాడ ఒకరిగా ఉంటూ వచ్చారు.ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాలు, సమస్యలు, రాష్ట్రస్థాయి అంశాలపై కూడా గుడివాడ అమర్ విశాఖ నుంచే గళం వినిపించేవారు. అయితే కొద్ది రోజులుగా ఆయన పూర్తిగా సైలెంట్ అయ్యారు. అసలు పార్టీలో ఉన్నారా.? లేరా అన్నట్లుగా మారిపోయింది ఆయన తీరు. పార్టీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న గుడివాడ తీరును చూసి ఆయన వెంట తిరిగే కొద్దిమంది నేతలే ఆశ్చర్యపోతున్నారట. సొంత పార్టీ నేతలే ఆయన సినిమా అయిపోయిందని చర్చించుకుంటున్నారట.పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత ఆప్తుడుగా చెప్పుకునే గుడివాడ అమర్నాథ్ ఇప్పుడు పార్టీకి టచ్ మీ నాట్ అన్నట్లుగా ఉండటానికి కారణాలేంటనే దానిపై రాజకీయవర్గాలలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. దీని వెనుక అత్యంత బలమైన కారణాలే ఉన్నాయట. రెండున్నరేళ్ల పాటు మంత్రి పదవి అనుభవించిన గుడివాడ అమర్‌నాథ్ పార్టీ అధినేత జగన్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన వర్గీయులే చెబుతున్నారు.తాను కోరుకున్న నియోజకవర్గానికి తనను ఇంచార్జ్‌గా నియమించలేదన్న అసంతృప్తి ఆయనలో బాగా పెరిగిపోయిందంటున్నారు. అందుకే అధినేత జగన్‌పై గుడివాడ అమర్ తీవ్ర అసహనంతో ఉన్నారని విశాఖ వైసీపీలో చర్చ జరుగుతోంది. అందుకే పార్టీ ఆఫీస్ ముఖం కూడా చూడటం లేదట గుడివాడ అమర్. ఇందుకు కారణం ఆయన కోరుకున్న విశాఖ నగర నియోజకవర్గ ఇంచార్జ్ పదవి దక్కకపోవడమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.గత ఎన్నికల్లో గుడివాడ అమర్నాథ్ గాజువాక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాస్ గుడివాడ అమర్‌పై విజయం సాధించారు. దీంతో ఆయన ఏకంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే గుడివాడ అమర్ విశాఖలో వాలిపోయారు. విశాఖ నగర పరిధిలో ఏదో ఒక నియోజకవర్గాన్ని తనకు అప్పగిస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.కానీ జగన్ మాత్రం గుడివాడకు విశాఖ నగరం, రూరల్ కూడా కాకుండా చోడవరం నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. దీంతో గుడివాడ తీవ్ర అసంతృప్తికి గురయ్యారట. అక్కడితో ఆగకుండా విశాఖ జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి కూడా గుడివాడను పీకేశారు జగన్.


ఇది తనకు పొమ్మనలేక పొగపెట్టినట్లేనని భావిస్తున్నారట అమర్. 2019 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసి గెలిచి మంత్రిగా ఉన్న ఆయనను ఆ నియోజకవర్గ నుంచి తప్పించి చివరి నిమిషంలో గాజువాక టికెట్ ఇవ్వడమే అవమానంగా ఫీల్ అవుతుంటే..ఎన్నికల తర్వాత గాజువాక ఇంచార్జ్ గానైనా కొనసాగించకుండా, జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు కూడా లేకుండా చేయడంతో..తీవ్ర నిరాశలో ఉన్నారట గుడివాడ.అందుకే పార్టీకీ, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సైలెంటైపోయారని టాక్ వినిపిస్తోంది. మంత్రిగా ఉన్నప్పుడు సీనియర్లను కూడా లెక్కచేయకపోవడం, తనంతటి వాడే పార్టీలో లేడు అన్నట్లుగా బిహేవ్ చేయడంతోనే..గుడివాడకు గ్రౌండ్ పాలిటిక్స్ తెలుసొచ్చేలా చేయడానికే పార్టీ స్కెచ్ వేసిందని అంటున్నారు. అసంతృప్తిలో ఉన్నప్పటికీ మళ్లీ పాత రోజులు వస్తాయని గంపెడు ఆశలతో ఎదురు చేస్తున్నారట గుడివాడ. ఆయన ఆశలు నెరవేరుతాయో లేదో చూడాలి మరి.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి - సూర్య వాస్తవం, జూన్ 29:** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 30 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## ఎస్వీ విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళం



**తిరుమల - సూర్య వాస్తవం, జూన్ 29:** చెన్నైకు చెందిన టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళంగా అందించింది. ఈ విరాళం చెక్కును సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ శ్రీనివాసన్ శనివారం సాయంత్రం తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో సీ. హెచ్.వెంకయ్య చౌదరికి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## మాజీ కౌన్సిలర్ ఎస్‌టీ గోవిందును పరామర్శించిన నాయకులు



**గుత్తి - సూర్య వాస్తవం, జూన్ 29:** గుత్తి బైపాస్ సర్జరీ చేయించుకున్న ఎస్‌టీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్‌టీ గోవిందుని పరామర్శించి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము. పరామర్శించిన 17 వ వార్డు ఇంచార్జ్ మైనార్టీ సీనియర్ నాయ కులు ఎస్ఎం భాష, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ సప్లయర్ సుంకన్న, లచ్చానపల్లి మాజీ సర్పంచ్ తిరుపాల్, సీనియర్ నాయకులు మస్తాన్ పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన ఆదినారాయణకు సన్మానం

**- ఆయన సేవలు వెలకట్టలేనివి**

**- అనంతపురం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ బార్ ఫ్రెండ్స్**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 29:** కర్పూరం ఫ్యాక్టరీలో నిబద్ధతతో పనిచేసి సోమ వారం నాడు పదవీ విరమణ చేస్తున్న ఆదినారాయణ సేవలు శ్లాఘనీయమని అనంతపురం ఆర్ట్స్ కాలేజ్ బార్ ఫ్రెండ్స్ కొనియాడారు. ఆదినారాయణ సేవలు మిగిలిన ఉద్యోగులు అందరికీ ఆదర్శనీయమని వారు ప్రసంశించారు. ఆదివారం నాడు బార్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసప్ప, ప్రసాద్, శేఖర్, రామకృష్ణ, శీన, భాస్కర్, నాని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదినారాయణ తన విధులను అత్యంత సమర్థవంతంగా, బాధ్యతతో నిర్వర్తించేవారని చెప్పారు. అంకితభావం, నిబద్దతకు ఆయన ప్రతిరూపమని పేర్కొన్నారు. నేటి తరం ఉద్యోగులు ఆయన పనితీరును చూసి స్ఫూర్తి పొందాలని కోరారు. చేసే ప్రతి ఉద్యోగికి వృత్తి పట్ల అంకితభావం, చిత్తశుద్ధి ఉండాలన్నారు. అందులో భాగంగానే తన పనిలో సంతోషాన్ని వెతుక్కుంటూ విధులను నిర్వహించరన్నారు. ఏ వృత్తి లోనైనా సానుకూల దృక్పథం విజయానికి సోపానమని, మాట పడకూడదన్న తపనే తమ విజయానికి కారణమని అన్నారు. తనకు చేదోడువాదోడుగా ఉన్న కుటుంబ సభ్యులకు, సహౌద్యోగులకు, మిత్రులకు ఈ సందర్భంగా ఆదినారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిత్రుడు ఆదినారాయణ కు జ్ఞాపికను అందిస్తూ దుస్సాలువతో ఘనంగా సత్కరించారు.


## సారా రహిత గ్రామాలకు సహకరించండి



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూన్ 29:** సారా రహిత గ్రామాలకు సహకరించాలని మదనపల్లె ఎక్సైజ్ ఎస్సైలు జబీవుల్లా, డార్కస్ లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మండలంలో ఉన్న కొండమీద చెరువుతండ, తుమ్మల తండ, దాదినాయుని తండా, చెంబకూరులోని హరిజన వాడల్లో ఆదివారం నాటు సారా తయారీ, అమ్మడం నిషేధం పై అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల ఆదేశాలతో చైతన్య కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. గ్రామస్థులందరూ కలిసి సారా రహిత గ్రామాలను తీర్చి దిద్దడానికి నవోదం 2.0లో భాగస్వాములు కావడం ఎంతో అవసరం ఉంది అన్నారు. తద్వారా మీ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ లు తెలిపారు.

## ప్రజలందరూ సంకల్పిస్తే డ్రగ్స్ లేని సొసైటీగా మార్చటానికి ఎక్కువ సమయం పట్టదు

**- జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు**




**తిరుపతి - సూర్య వాస్తవం, జూన్ 29:** జిల్లా పోలీసువారు, 92.7 బిగ్ ఎఫ్ఎం వీడియో సంయుక్తంగా నిర్వహించిన మత్తు వదలరా 3కె రన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఐపీఎస్ హాజరైనారు. మత్తు వదల రా 3కె రన్ లో చిన్నపిల్లల నుండి పెద్ద వయస్సు వారందరూ పాల్గొన్నారు. తిరుపతి బస్టాండ్ వద్ద ఉన్న పూర్ణకుంభం నుండి టిఎన్ పాలెం వరకు మూడు కిలోమీటర్లు మత్తు వదలరా 3 రన్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నివారణ కోసం ప్రత్యేకంగా ఈగల్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్, గంజాయి స్థావరాలపై దాడులు చేసి అనేక మందిని పట్టుకోవడం జరిగిందన్నారు. మత్తు పదార్థాలు అనేవి ఈతరం తోనే అంతరించిపోవాలని రాబోయే తరానికి మత్తు పదార్థాలు కంటికి కూడా కనిపించ కూడదన్నారు. ఈ క్షణం నుంచే ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలు నివారణ కోసం తమ వంతు సహకారాన్ని పోలీసు వారికి అందించాలన్నారు. ఈ మత్తు పదార్థాలకు మా కుటుంబ సభ్యులు అలవాటుపడలేదు. మాకు సంబంధం లేదు అనుకోవద్దన్నారు. ప్రతి ఒక్క పౌరుడు తమ వంతు సహకారం అందిస్తేనే ఈ మత్తు పదార్థాలు నివారించవచ్చని తెలియజేశారు.

ఇప్పటికైనా సరే ప్రతి పౌరుడు స్పందించి మత్తు పదార్థాలు ఎవరు విక్రయిస్తున్న మత్తు పదార్థాలు ఎవరు సేవిస్తున్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేకంగా 1972 అనే నెంబర్లను ఏర్పాటు చేసింది అన్నారు. పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చేందుకు భయపడితే వెంటనే రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి 1972 కి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. సమాచారం ఇచ్చినటువంటి వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. ఈ 3కె రన్ పాల్గొన్నటువంటి ప్రతి ఒక్కరిని జిల్లా ఎస్పీ అభినందించారు. అదేవిధంగా మత్తు వదలరా కార్యక్రమానికి పోలీసు వారితో కలిసి నిర్వహించిన 92.7 బిగ్ ఎఫ్ఎం రేడియో ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కె.రవి మనోహరాచారి అదనపు ఎస్పీ శాంతి భద్రతలు, భక్తవత్సలం డి.ఎస్.పి తిరుపతి టౌన్, శ్రీనివాసులు, సీఐ, ఈస్ట్ పీస్ రమణ రెడ్డి, ఆర్ఐ ఆర్మడ్ రిజర్వుడ్ పాల్గొన్నారు.

## టీటీడీ అందిస్తున్న వివిధ సేవలపై భక్తుల నుంచి విస్తృత అభిప్రాయ సేకరణ



**తిరుమల - సూర్య వాస్తవం, జూన్ 29:** భక్తులకు అందిస్తున్న వివిధ సేవలను ఎప్పటికప్పుడు మరింత మెరుగుపరచడంలో భాగంగా గత కొంత కాలంగా టీటీడీ భక్తుల నుండి విలువైన అభిప్రాయాల్ని వివిధ రకాల ఫీడ్‌బ్యాక్ సర్వేల ద్వారా సేకరించడం ప్రారంభించింది. ఐవీఆర్ఎస్, వాట్సాప్ల ద్వారా ఈ సర్వే, శ్రీవారి సేవకుల ద్వారా మాన్యువల్ సార్వే లను ప్రారంభించి టీటీడీ భక్తుల నుండి అభిప్రాయాలు తీసుకుంటోంది.

**ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ సర్వే :** ఈ ఎలక్ట్రానిక్ సర్వే విధానం ద్వారా భక్తులు తిరుమల యాత్ర పూర్తి అనుభవం, అన్నప్రసాదం, కళ్యాణ కట్ట, శ్రీవారి ఆలయం, వసతి, క్యూ లైన్ల నిర్వహణ, లగేజ్ కౌంటర్ల పై మొత్తం 16 ప్రశ్నలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు.

**వాట్సాప్ ఫీడ్ బ్యాక్ విధానం :** తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను మొబైల్‌తో స్కాన్ చేస్తే (వాట్సాప్ నెం: 9399399399) టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ భక్తులు తమ పేరు, విభాగం (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూ ప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు మొదలైనవి) ను ఎంచుకోవాలి.

**శ్రీవారి సేవకుల ద్వారా అభిప్రాయ సేకరణ :** తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రత్యక్షంగా అభిప్రాయ సేకరణ చేయడం జరుగుతోంది. ఈ విధానంలో సేవకులు టీటీడీ రూపొందించిన ప్రశ్నావళితో కూడిన అప్లికేషన్‌ను తమ మొబైల్‌లో డౌన్లోడ్ చేసుకుని భక్తుల నుండి అభిప్రాయాలు సేకరిస్తారు. త్వరలోనే టీటీడీ మొబైల్ యాప్, టిటిడి బుకింగ్ పోర్టల్ నుండి భక్తులు యొక్క విలువైన సలహాలు సూచనలు తీసుకొనడానికి అప్లికేషన్ రూపొందించ బడుతున్నది. భక్తుల అభిప్రాయాన్ని గౌరవిస్తూ, సేవలను మరింత మెరుగుపరచడం కోసం ఈ సర్వేల ద్వారా వారి ప్రత్యక్ష అనుభవాలను సేకరించడం జరుగుతోంది. ఈ విధానాల ద్వారా భక్తులు తమ అభిప్రాయాలను తెలియజేసి ఆన్ లైన్ సేవలను మెరుగుపరిచేందుకు తోడ్పడాల్సిందిగా టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## కెమికల్ ఫ్యాక్టరీల నిర్మాణాలు ఆపండి

**- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పలు కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు**

**- ఫ్యాక్టరీలు వద్దు ప్రజల ప్రాణాలే ముద్దు అంటూ ఆందోళనకు దిగిన ఓబులాపురం ప్రజలు**



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూన్ 29:** డి హీరేహాళ్ మండల పరిధిలోని ఓబులాపురం గ్రామ పరిసరాలలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న లోహిత ఫార్మసీ కెమికల్ ఫ్యాక్టరీని నిర్మించకూడదని ఓబులాపురం ప్రజల ఆందోళనకు దిగారు. కర్ణాటక సరిహద్దుల్లో పలు కెమికల్ ఫ్యాక్టరీలు నిర్మించడంతో పలు గ్రామాల ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, ఓబులాపురం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో నూతనంగా నిర్మిస్తున్న కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యం దగ్గర వెళ్లి నిర్మాణం ఆపివేయాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఓబులాపురం గ్రామ టిడిపి అధ్యక్షుడు తాయప్ప మాట్లాడుతూ.. పక్కనే కర్ణాటక రాష్ట్రం బళ్ళారి ఏరియాలో ఇలాంటి కెమికల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడంతో పలు గ్రామాలలో ప్రజలు చర్మవ్యాధి, ఆస్తమా, క్యాన్సర్ ఊపిరితిత్తుల సమస్యలతో ప్రజల ఆరోగ్యం ఈ నుంచి పోవడం జరిగిందన్నారు. ఈ విధంగా ముంద్రికి గ్రామ ప్రజలు గతంలో కెమికల్ ఫ్యాక్టరీలు యాజమాన్యంపై, అధికారులపై ఆందోళన చేపట్టి ఇలాంటి ఫ్యాక్టరీలు మా ప్రాంతంలో నిర్మించకూడదని తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ప్రస్తుతం అక్కడున్న కెమికల్ ఫ్యాక్టరీలను చుట్టుపక్కల భూములు కొనుగోలు చేసుకొని, ఓబులాపురం గ్రామ చుట్టుపక్కల ఇలాంటి కెమికల్ ఫ్యాక్టరీలు నిర్మించడానికి పెద్ద సంఖ్యలో ఫ్యాక్టరీ యజమానులు వస్తున్నారన్నారు. లోహిత ఫార్మా ఫ్యాక్టరీ నూతన నిర్మాణం చేపట్టితే ఓబులాపురం ప్రజలు అనారోగ్యానికి గురి కావడంతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాలలో కెమికల్ ఫ్యాక్టరీ ద్వారా వస్తున్న కాలుష్యం వల్ల రైతులు పంటలు పండక నష్టపోయే పరిస్థితి ఉందని ఆయన అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఓబులాపురం గ్రామ ప్రజల ప్రాణాలను కాపాడాలని, లోహిత కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణం ఆపాలని, సంబంధిత అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి కెమికల్ ఫ్యాక్టరీలు నిర్మాణాలు చేపట్టితే నిర్మాణాలు ఆపడానికి గ్రామ ప్రజలందరూ మమేకమై ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అడ్వకేట్ ఆదిబసప్ప, ప్రకాష్ రెడ్డి, బించే బసప్ప, రాజు, ప్రకాష్, దాసరి బసప్ప, పంప, అంగడి కేశవ, కరి బసవ గౌడ్, వెంకట్ రెడ్డి, రాము, బసయ్య, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## విద్య, ఉపాధి, నిరుద్యోగంపై పోరాటమే డివైఎఫ్ఐ లక్ష్యం

**- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్**

**- డివైఎఫ్ఐ ప్రాంతీయ నూతన కమిటీ ఎన్నిక**




**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 29:** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ పత్తికొండ ప్రాంతీయ నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఒక నిర్దిష్ట ప్రాంతంలోని స్థానిక సమస్యలతో ప్రతిధ్వనించే ఉద్యమాలను పెంపొందించడంపై డివైఎఫ్ఐ దృష్టి సారిస్తుందని ఆయన అన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో పేద మధ్యతరగతి నివసించే ప్రాంతాల్లో ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు కనీసం సిమెంట్ రోడ్లు కూడా వేయని పరిస్థితులు నెలకొన్నాయని ధనిక వర్గాలకు చెందిన కాలనీలలో మాత్రమే సిసి రోడ్లను వేసి వాటిని భూతద్దంలో చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై స్పందించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**- మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్**



**రాయచోటి, విజయవాడ – సూర్య వాస్తవం, జూన్ 29:** రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారని. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా తాను పరిశీలించి,పరిష్కారాని కి ఆయా ప్రాంతాల సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేసారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి 'సూర్య" వాస్తవం రాయచోటి దినపత్రిక విలేఖరికి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై వెంటనే తగు చర్యలు చేపట్టి నట్లు వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియజేశారు. సమస్యలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెంటనే స్పందించడంతో పలువురు స్థానికులు హర్షం వేత్తం చేస్తున్నారు.

## నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- అర్జీలపై సమాచారం కోసం మీకోసం కాల్‌సెంటర్ నెంబర్ 1100 ను సంప్రదించగలరు - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**రాయచోటి – సూర్య వాస్తవం, జూన్ 29:** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్య క్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారు లు వారి అర్జీలను జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే అవ సరం లేకుండా వెబ్సైట్‌లో నమోదు చేసుకో వచ్చుని, వారి యొక్క అర్జీల నమోదు, నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## సిపిఓ కార్యాలయంలో 19 వ గణాంక దినోత్సవ వేడుకలు



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 29:** అనంతపురం నగరంలోని సిపిఓ కార్యాలయంలో 19వ గణాంక దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భారత గణాంకాల పితామహుడు, 1 వ ప్రణాళికా సంఘం సభ్యుడు, భారత గణాంక సంస్థ వ్యవస్థాపకుడు పిసి.మహల్చంద్ర నోబిస్ జయంతి సందర్భంగా గణాంక దినోత్సవ వేడుకలను నిర్వహించగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఓ అశోక్ కుమార్, ఎస్ఓ మనోహర్, డిప్యూటీ ఎస్ఓలు సేనా నాయక్, పోతిరెడ్డి, తదితరులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఓ అశోక్ కుమార్ మాట్లాడుతూ భారత గణాంక సంస్థ వ్యవస్థాపకుడు పిసి.మహల్చంద్ర నోబిస్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## కొట్టె శేఖర్‌ను పరామర్శించిన రాష్ట్ర టీడీపీ నేత సుగవాసి ప్రసాద్ బాబు



**రాయచోటి – సూర్య వాస్తవం, జూన్ 29:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో ని మాసాపేట కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయ కుడు కొట్టె శేఖర్ కాలు విరిగి చికిత్స పొంది ఇంటిదగ్గర వున్న అతని విషయం తెలిసి వెంటనే రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుపతి తిరుమల దేవస్థానములు పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ఆదివారం అతని ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్‌కి తీవ్ర గాయాలు



**మదనపల్లె – సూర్య వాస్తవం, జూన్ 29:** ట్రాక్టర్ ఢీకొని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరాడు. శనివారం రాత్రి పుంగనూరు రోడ్డులో జరిగిన ఘటనపై మదనపల్లె తాలూకా పోలీసుల కథనం.. అన్నమయ్య జిల్లా, నిమ్మనపల్లి మండలం, ఆచార్లపల్లికి చెందిన రమణ (35), అక్క గార్ల గుడి వద్ద ఉండే ఓ ప్రైవేట్ స్కూల్ కు కొంత కాలంగా బస్సు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. రాత్రి సొంత పనిపై బసినికొండకు వచ్చిన రమణ, పని ముగించుకుని తిరిగి స్కూలు వద్దకు బైక్ లో వెళు తుండగా, బై పాస్ రోడ్డులోని వైన్ జంక్షన్ వద్ద ట్రాక్టర్ బైకును ఢీ కొట్టడంతో రమణ తీవ్రంగా గాయపడ్డాడు. ఉపాధి తిని వెంటనే మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో, రాణాపాయం తప్పి కోరుకుంటున్నాడు. ఘటనపై తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సంక్షేమం, అభివృద్ధి రెండూ చేస్తున్నాం

**- రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు**

**- జులై 2 నుంచి ఇంటింటికి వెళ్లి తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు చెబుతామన్న ఎమ్మెల్యే**

**- తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 29:** ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఓవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళగిరి రాష్ట్ర టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశం, సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. జూలై 2 నుంచి చేపట్టబోతున్న ఇంటింటికి ప్రచార కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సందేశం అందర్నీ ఆలోచింపజేసిందన్నారు. ఖచ్చితంగా తాము చేసిన అభివృద్ధి గురించి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఇంటింటికి వెళ్లి తెలియజేయాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. ఇప్పటికే వైసీపీ నాయకులు అన్ని విధాలుగా దుష్ప్రచారాలు చేస్తూ బురద చల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏడాది కాలంలో సుపరిపాలన అందించామన్న సంతృప్తి మాతోపాటు రాష్ట్ర ప్రజల్లో కూడా ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉండకూడదన్న ఉద్దేశంతోనే వైసీపీ నాయకులు రీకాలింగ్ మేనిఫెస్టో వంటి కార్యక్రమాలకు తెర లేపారని విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నారని ఇందుకు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. రాష్ట్ర బడ్జెట్ లోటులో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. జూలై 2 నుంచి ప్రతి కార్యకర్త, నాయకుడు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. అలాగే రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

**- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 29:** ఈ నెల 30 వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. అలాగే అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని సూచించారు.

# శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు







**తిరుపతి – సూర్య వాస్తవం, జూన్ 29:** తిరుపతి రాయల చెరువు రోడ్డులోని శ్రీ శక్తిపీఠం శ్రీ పాతాళ శ్వేత వారాహీ క్షేత్రంలో శ్రీ వారాహి నవరాత్రులు సందర్భముగా శ్రీ శ్రీ శ్రీ అమ్మవారిని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం శ్రీ మరకత శక్తి కాళీదేవి, శ్రీ మరకత సిద్దేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ శక్తి పీఠాదేశ్వరీ మాతాజీ శ్రీ శ్రీ రమ్యానంద భారతి స్వామిని మర్యాద పూర్వకంగా ఛైర్మన్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ మాట్లాడుతూ, శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించి స్వామి వారు, మాతాజీ వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. శ్రీ శక్తి పీఠంలో చాలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

ఈ పీఠంలో పూజా కైంకర్యాలు, అన్నదానం చాలా బాగా చేస్తున్నారని చెప్పారు. ఈ పీఠాన్ని సందర్శిస్తే కష్టాలు తీరుతాయనే విశ్వాసంతో భక్తులు చాలా మంది వస్తున్నారని ఛైర్మన్ చెప్పారు. ప్రస్తుతం టిటిడి చాలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నట్లు శ్రీ శక్తి పీఠం నిర్వాహకులు అభినందించారని తెలిపారు. ముందుగా టిటిడి ఛైర్మన్ శ్రీ శక్తి పీఠం చేరుకోగానే నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం టిటిడి ఛైర్మన్ ను సత్కరించి వైదేహి మాలను సమర్పించారు. శక్తి పీఠం తరుపున పుస్తక ప్రసాదాన్ని ఛైర్మన్ కు అందించారు. అనంతరం స్వామి, అమ్మవారిని టిటిడి ఛైర్మన్ శాలువాతో సత్కరించి శ్రీవారి ప్రసాదాలను అందించారు.

# సోలార్ ప్రాజెక్టుకు బీసీవై పార్టీ వ్యతిరేకం కాదు

**- బలవంతంగా రైతులు భూములు లాక్కుంటే సహించం బీసీవై అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి**

**- జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ పిలుపుతో వేలాదిమంది రోడ్లపైకి వచ్చిన రైతులు**



**రాయదుర్గం – సూర్య వాస్తవం, జూన్ 29:** సోలార్ ప్రాజెక్టుకు బీసీవై పార్టీ వ్యతిరేకం కాదని, రైతుల నుండి రాష్ట్ర ప్రభుత్వం బలవంతరంగా భూములు లాక్కుంటే సహించేది రాయదుర్గం బీసీవై అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా గౌనీ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లా, కరేడు గ్రామంలో దాదాపుగా 8300 ఎకరాల భూములను రైతుల నుండి బలవంతంగా తీసుకోవడానికి ప్రయత్నిస్తుండడంతో, జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ పిలుపుమేరకు రాష్ట్రంలో దాదాపుగా లక్షల మంది రైతులు, రోడ్లపై వచ్చి ధర్నాలు ఏపడుతున్నారన్నారు. జాతీయ అధ్యక్షులు నెల్లూరు జిల్లా కారేడు గ్రామం రైతుల బాధను తెలుసుకోవడానికి వెళ్తుండగా, అడుగడుగున రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ద్వారా, జాతీయ అధ్యక్షులను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రాజెక్ట్ రద్దుకు సిఫార్సు చేయాలని బీసీవై పార్టీ డిమాండ్ చేయగా, స్పందించిన సబ్ కలెక్టర్ రద్దుకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చామన్నారు. ప్రభుత్వ హామీతో జాతీయ నాయకులు రామచంద్రా యాదవ్ ఆందోళనను విరమించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో ఊహించలేనంత స్థితిలో ఉద్యమం చేపడతామన్నారు. కరేడు గ్రామంలో ఇండోనేషియాల్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం 83 00 ఎకరాల భూములను రైతుల నుండి బలవంతంగా భూ సేకరణ చేపడితే బీసీవై పార్టీ సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా రాయదుర్గం పట్టణంలోని బీసీవై పార్టీ అధ్యక్షులు ఒక ప్రకటన విడుదల చేస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా కూడా రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ప్రాజెక్టులు నిర్మాణం కోసం రైతుల భూములు సేకరిస్తుందన్నారు. కొంతమంది స్వచ్ఛందంగా రైతన్నలు భూములు ఇస్తున్నప్పటికీ మరి కొంతమంది రైతులు అహిష్టంగా ఉన్న రైతులు భూములను బలవంతం చేపడితే సహించేది లేదని, ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సుపరిపాలన తొలి అడుగు సమావేశం



**రాయచోటి, అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 29:** మంగళగిరి తెలుగు దేశం జాతీయ పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆధర్యంలో ఆదివారం జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు సమావేశంలో రాష్ట్ర రవాణా, యోజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్, కడప ఎమ్మెల్యే, విప్ మాధవి రెడ్డి, సాచర మంత్రులతో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం పై మంత్రులకు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇంచార్జిలకు దిశానిర్దేశం చేశారని సమాచారం. ఈ కార్యక్రమంలో జరిగిన ఏడాది పాలనలో తెలుగుదేశం పార్టీ సాధించిన విజయాల గురించి వారు చర్చించుకున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్యాంప్ కార్యాలయ సమాచారాన్ని అందించారు.

## జాతీయస్థాయి సమావేశాలకు పురం మునిసిపల్ చైర్మన్ డిఈ రమేష్




**హిందూపురం - సూర్య వాస్తవం, జూన్ 29:** హర్యాణా రాష్ట్రంలోని గురుగ్రాంలో జూలై 3, 4 తేదీల్లో జరిగే జాతీయస్థాయి సమావేశంలో హిందూపురం మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్ హాజరు కానున్నట్లు తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం. దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై సమావేశాలు రెండ్రోజులపాటు జరుగనున్నాయి. ఈ సమావేశాలు దేశ పార్లమెంట్, హర్యాణా ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తుంది. కేంద్రపాలిత పట్టన స్థానిక సంస్థల చైర్మన్లకు ఆహ్వానం పలికారు. ఇందులో హిందూపురం మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈయన వెళ్లనున్నట్లు తెలిపారు. అయితే ఇటీవల తిరుపతిలో జరిగిన ఆర్థిక సంఘం సమావేశానికి రాయలసీమ నుంచి హిం దూపురం మునిసిపల్ చైర్మన్ ఒక్కడే హాజరయ్యారు. జాతీయస్థాయి సమావేశాల్లో కూడా ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## చిన్నారులకు ఉయ్యాల నిర్వహణ



**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 29:** చిన్నమండెం మండల పరిధిలోని చాకిబండ గ్రామానికి చెందిన అస్సాద్, ఉమెరాల కుమార్తెలు ఉయ్యాల కార్యక్రమం ఆదివారం పి సి ఆర్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరితమ్మ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి, మౌర్య రెడ్డిలు హాజరైనారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం



**హిందూపురం - సూర్య వాస్తవం, జూన్ 29:** పరిగి మండలం కొడిగెనహళ్లికి చెందిన నయుం కొంతకాలంగా వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.25,500 అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యకులు అమాన్ మాట్లాడుతూ నయీం తండ్రి మహబూబాబాష కార్పెంటర్ అయితే కుమారుడి వైద్యంకు ఖర్చు అధికం కావడంతో ఇక ఖర్చుభరించే స్థోమతలేకపోవడంతో విషయం తెలుసుకుని మరికొంతమంది సహకారంతో ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో ట్రస్ట్ సభ్యులు పారూక్, ఆర్ఫాన్, ఉస్మాన్, సాదిక్, పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కి తీవ్ర గాయాలు



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూన్ 29:** ఆటో అదుపు తప్పి బోల్తా పడి డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు మదనపల్లె తాలూకా సిఐ కళ వెంకటరమణ తెలిపారు. సీఐ కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం, బెంగుళూరు వైట్ ఫీల్డ్ లో కాపురం ఉంటూ ఆటో నడుపుకుంటున్న అనీల్ (29) మదనపల్లె మండలం, కొత్తపల్లె గ్రామం, ఎలకపల్లె కుంటలో కాపురం ఉంటున్న చెల్లెలు లక్ష్మీదేవిని చూడటానికి బెంగుళూరు నుండి మదనపల్లెకు వస్తుండగా, మార్గ మధ్యంలోని మదనపల్లె మండలం, చికిలబైలు సరిహద్దు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించ బోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అనిల్ ను స్థానికులు 108లో వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో కుటుంబీకులు బెంగళూరుకి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# కల్తీ క మా(తే)ల్

**- విచ్చలవిడిగా వంట నూనెల కల్తీ...!**

**- ఆరోగ్యాన్ని హరిస్తున్న లూజ్ ఆయిల్ - విషపూరితమైన ఆఫ్లాటాక్సిన్స్**

**- వాడితే క్యాన్సర్ తో పాటు జీర్ణ సమస్యలు - తూతూ మంత్రంగా సంబంధిత శాఖ తనిఖీలు**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 29:** కాదేదీ కల్తీకి అనర్హం అనే సామెతను అడ్డదారులు తొక్కుతున్న వ్యాపారులు సరిగ్గా వంటబట్టించుకుంటున్నట్లుంది. ఈ కల్తీ వ్యవహారాన్ని అడ్డుకునే వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోజురోజుకు కల్తీ మాఫియా రెచ్చిపోతోంది. దీంతో సదరు కల్తీ వంటనూనె వాడుతున్న కుటుంబాల్లో చాలావరకు అనారోగ్యం భారిన పడ్తున్నారు. వంట నూనెలు విచ్చలవిడిగా కల్తీ అవు తున్నాయంటే అవుననే అంటున్నారు. అనంత వాసులు. లూజ్ ఆయిల్ కొన్నింటిలో ఏమాత్రం క్వాలిటీ ఉండటం లేదు. మరికొన్నింటిని వాడటం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కల్తీ వంట నూనెల్లో విషపూరితమైన ఆఫ్లాటాక్సిన్ లు, ఆరోగ్యానికి హాని చేసే హెవీ మెటల్స్ ఉంటున్నట్లు గతంలో లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్-ఎస్ఏఐ) నిర్వహించిన పరీక్షల్లో తేలిన సంగతి విధితమే. వంట నూనెల్లో పల్లి నూనె అత్యధికంగా కల్తీ అవుతోంది. ఆ తర్వాత స్థానాలలో పామాయిల్, సోయాబీన్, రైస్ బ్రాన్, నువ్వుల నూనె, కొబ్బరి నూనె ఉన్నాయి. వంట నూనెల్లో ఏ, డీ విటమిన్లు కూడా ఉండాల్సిన స్థాయిలో లేవని వెల్లడైంది. దేశవ్యాప్తంగా 15 రకాల ఎడిబుల్ ఆయిల్స్? పై ఎఫ్ఎస్ఎస్ఏఐ చేసిన సర్వేలో ఈ విషయాలు బయటపడ్డాయి. కల్తీ నూనె తో వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నారనే వాదనలు ఉన్నాయి. వ్యాపారులు సిండికేట్గా ఏర్పడి కలెక్షన్లు కూడాపెట్టి అధికారులకు మామూలు ఇటున్నరనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో అధికారులు వస్తున్నారంటే వీరికి ముందే సమాచారం వస్తుందని తనిఖీలకు వెళ్లి జేబులు నింపుకోవడానికి రావడమే తప్ప చేసిందేమీ లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పత్రికాముఖంగా మాత్రం కఠిన చర్యలు తప్పవని స్టేట్మెంట్లు ఇస్తున్నారు కానీ జిల్లా స్థాయిలో ఆయిల్ ధరల పై మరియు నూనె యొక్క క్వాలిటీ పై ఎటువంటి సోదాలు నిర్వహించడం లేదు ఒకవేళ సోదాలు జరిపిన అది వారి కోసమే తప్ప ప్రజలకు ఉపయోగపడేది ఏమి లేదు అని అంటున్నారు జిల్లా ప్రజలు. అప్పుడప్పుడు తూతూమంత్రంగా తనిఖీలు చేసి వెళ్తున్నారని అధికారుల తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద తిమింగలాలను వదిలేసి చిన్న చేపల పై కేసు నమోదు చేస్తున్నారని వ్యాపార వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. బడా బాబులు మాత్రం వారి అక్రమ దందా యధావిధిగా కొనసాగిస్తున్నారు. రెవెన్యూ శాఖ, తూనికలు కొలతలు, పౌర సరఫరా, వాణిజ్య పన్నుల శాఖ, ఆహార నియంత్రణ శాఖ నుంచి తనిఖీలు కనబడటం లేదని వారికి అందేవి అందితే చాలని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

**కల్తీ నూనెలతో కేన్సర్**


కల్తీ నూనెలతో గుండె జబ్బులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. జంతు కళేబరాలతో ఆయిల్ తయారు కావడంతో కేన్సర్ సోకే ప్రమాదం ఉంది. ఈ నూనెతో అతి రోస్కిమరోనిస్ అనే పదార్థం ఉండడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ఐఎస్ఐ మార్కు ఉన్న నూనెలనే వాడాలి.



- బి. విక్రమ్ నాయుడు, ఎం.బి.బి.ఎస్ డాక్టర్ :

# విచ్చలవిడిగా ఇసుక మాఫియా

**- దొడగట్ట చెరువులో పట్టపగలే మట్టి చోరీ**



**ప్రత్యేక ప్రతినిధి - సూర్య వాస్తవం, జూన్ 29:** గత 15 రోజుల నుండి తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత పేరు చెప్పి మండల అధికారపార్టీ ముఖ్య నాయకులు దొడగట్ట గ్రామానికి చెందిన ఇంకొక నాయకుడితోపాటు జెసిబి, హిటాచి లాంటి భారీ యంత్రాలతో పెద్ద సైజు టిప్పర్ లారీలతో రాత్రి పగలు తేడా లేకుండా మట్టి దోపిడీ చేస్తూ కర్ణాటకలోని బళ్ళారి, రాంపుర మరియు మొలకాల్మూరు ప్రాంతాలకు తరలించి కోట్ల రూపాయలు దోచుకుంటున్నట్లు గ్రామ ప్రజలందరూ వాపోతున్నారు.. నిలబడి దోపిడీ చూడడమే తప్పా తప్పు అని నిలదీసే ధైర్యం చేయలేకపోతున్నారు నోరు విప్పి మాట్లాడినా నిలదీసిన ఎక్కడ తప్పుడు కేసులు పెట్టి వేధిస్తారో అంటూ భయభ్రాంతులకు గురౌతున్నారు ఇంత అన్యాయం జరుగుతున్నా అడిగే నాథుడే లేడా? అధికారులు ఏం చేస్తున్నారంటూ లోలోపల బాధపడుతూ ఎవరి పేరు బయటికి వెళితే ఎవరి పైన ఎలాంటి తప్పుడు కేసులు పెడతారో అని భయపడుతూ బ్రతుకుతున్నారు ఇలాంటి పరిస్థితి మేము పుట్టినప్పుడు నుంచి ఎప్పుడూ చూడలేదు అంటూ ఊరిలో గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. అక్రమ మట్టి తరలింపు ఫోటోలు తీసుకోవడానికి కూడా అందరూ జంకుతున్నారు. చూడడమే తప్ప ఏమీ చేయడానికి సాధ్యం కానీ నిస్సహాయ స్థితిలో ప్రజలు ఉన్నారంటే ఎంతటి భయభ్రాంతులకు గురవుతున్నారో చెప్పలేని దయనీయ పరిస్థితి ఉంది దీనిని ప్రశ్నించే నాధుడే లేడా అంటూ ఒకరికొకరు ప్రశ్నలు వేసుకోవడం తప్ప విషయాన్ని అధికారులకు తెలియజేసే నాథుడే లేడు. ధైర్యం చేసి ఎవరైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం మాత్రం శూన్యం. ఇంత జరుగుతున్నా ఇంతవరకు బయటకుపొక్కక పోవడం దీనిపైన ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టకపోవడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది రాయదుర్గం నియోజకవర్గంలో అధికార పార్టీ ముఖ్య నాయకుడి తో పాటు మండల తాసిల్దార్, ఇతర రెవెన్యూ ఉన్నతాధికారులు, కొంతమంది కి కూడా ఇందులో వాటాలు ఉన్నట్లు సదరు తెలుగుదేశం నాయకులు చెప్పుకుంటున్నారనీ ప్రజలు గుసగుస లాడుకుంటున్నారు. ప్రజలు ఓటు వేసి గెలిపించింది రాత్రి పగలు దోచుకోవడానికేనా అంటూ ప్రజలు మదన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి జరుగుతున్న వాస్తవాలను బహిరంగ పరుస్తారని, అక్రమట్టి తొలదాన్ని ఆపి అట్టి వారిపై చర్యలు తీసుకుంటారని లేని పక్షంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని

### తాడిపత్రిలో హై టెన్షన్

# కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటికి పోలీసులు

**- తాడిపత్రి నుంచి వెళ్లిపోవాలని పెద్దారెడ్డికి పోలీసుల ఆంక్షలు - నా ఇంట్లో నేను ఉంటే తప్పేంటని ప్రశ్నించిన పెద్దారెడ్డి**



**తాడిపత్రి - సూర్య వాస్తవం, జూన్ 29:** అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొని పోలీసులను కలవర పెట్టాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎలాంటి సమాచారం లేకుండా తాడిపత్రికి రావడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. అటు జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటికి, ఇటు పెద్దారెడ్డి నివాసానికి అనుచరులు భారీగా చేరుకోవడంతో పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తాడిపత్రిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసుల కళ్లుగప్పి తాడిపత్రిలోని భగత్‌సింగ్ నగర్‌లో ఉన్న తన నివాసానికి చేరుకున్నారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులకు, తాను హైకోర్టు ఆదేశాలతో తన నివాసానికి వచ్చానని కేతిరెడ్డి చెప్పారు. అటు జేసీ ప్రభాకర్ రెడ్డి భారీగా తన అనుచరులతో పెద్దారెడ్డి నివాసంవైపు బయలు దేరడంతో పోలీసులు జోక్యం చేసుకొని మధ్యలో ఆపివేశారు.

# ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన వారికి సన్మానం



**తిరుపతి జిల్లా నాయుడుపేట - సూర్య వాస్తవం, జూన్ 29:** ఆదివారం ఉదయం 11 గంటలకు నాయుడుపేట ఉద్యోగుల విశ్రాంత భవనంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ గ్రేడ్ 2 గా పదోన్నతి పొందినచే వెంకట్రావు, కె.సుబ్బరామయ్యను, బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రిటైడ్ లెక్చరర్ పేర్నాటి వెంకటేశ్వర్లు,రిటైర్డ్ మండల విద్యాశాఖాధికారి నల్లమాకుల శ్రీనివాసులు, బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పల్లం వేణుగోపాల్ రాష్ట్ర ట్రెజరర్ పి.ఆదినారాయణ, తిరుపతి జిల్లా ఇంచార్జి లక్ష్మయ్య, బిటిఏ రాష్ట్ర కార్యదర్శి మునస్వామి, యం.వెంకటశేషయ్య, బిటిఏ అదనపు కార్యదర్శి పేర్నాటి రామకృష్ణ పాల్గొన్నారు. లక్ష్మీప్రసాద్ బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయుడుపేట మండల నాయకులు పి.చంద్రయ్య, బి.బాబు, చిట్టమూరు మండల నాయకులు జి.వెంకటేశ్వర్లు, బి.సుధాకర్, వాకాడు మండల నాయకులు టీవీ రమణయ్య, మస్తానయ్య, దొరవారిసత్రం, మండల నాయకులు టీ.నాగరాజు, వినయ్ కుమార్, బంసెఫ్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అసమానతలపై

# శేఖర్ కమ్ముల ప్రయోగం 'కుబేర'

మూసకథల ధోరణిలో దూసుకుపోతున్న టాలీవుడ్‌లో సరికొత్త ప్రయోగం 'కుబేర' సినిమా. ఏలూరుజిల్లాకు చెందిన ఆయన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా అమెరికాలో కొన్నాళ్లు పనిచేసి ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చేశారు. ఆ తర్వాత అక్కడ పనిచేస్తూనే సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆయన 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో మంచి బ్లాక్‌బస్టర్ సినిమాలను అందించారు. తాజాగా ఆయన తీసిన 'కుబేర' సినిమా ఓ ప్రయోగమే. తమిళ స్టార్ నటుడు ధనుష్, అక్కినేని నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ పాన్ ఇండియా సినిమా ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై మంచి ఆదరణ పొందుతోంది. సామాజిక సందేశంతో కూడిన క్రైమ్ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా మొదట్లో మిశ్రమ స్పందన అందుకున్నా మరుసటిరోజు నుంచి పాజిటిక్ టాక్‌తో బాక్సాఫీసులో దూసుకుపోతోంది.

**రొటీన్‌కి భిన్నం**

శేఖర్ కమ్ముల గతంలో తీసిన ఆనంద్, గోదావరి, ఫిదా, లవ్‌స్టోరీ వంటి సినిమాల మాదిరిగానే, కుబేర కూడా కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ధనుష్, నాగార్జున, రష్మిక నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. దేవిశ్రీప్రసాద్ సంగీతం, శేఖర్ కమ్ముల స్క్రీన్ ప్లే కూడా సినిమాకు బలంగా నిలిచాయి. ఓవర్సీస్‌లో కూడా సినిమా మంచి వసూళ్లను రాబట్టింది. అమెరికాలో విశేష ఆదరణ పొందింది.

**అసమానతలకు ప్రతిరూపం**

సినిమా అనేది సమాజ చైతన్యానికి ప్రతిరూపం. సమాజ రుగ్మతలను పట్టిచూపి వాటికి పరిష్కార మార్గాలను చూపే శక్తి కూడా దర్శకుడి ప్రతిభను బట్టి ఉంటుంది. సమాజంలోనూ, మన చుట్టూ ఉన్న ప్రాంతాల్లో జరిగే అంశాలను ఇతివృత్తంగా తీసుకుని సినిమాలు తీయటం తెలిసిందే. ఇవి బాక్సాఫీసు వద్ద హిట్‌ను కూడా అందుకుంటున్నాయి. అతి హింస, విపరీతమైన సెక్స్, విఎఫ్‌ఎక్స్‌తో సరికొత్త కల్పిత ప్రపంచాలు సృష్టిస్తూ వచ్చిన సినిమాలు కూడా ఆడుతున్నాయి. కానీ ఇవి సమాజానికి చేటుచేస్తున్నాయి. యువతను పక్కదారి పట్టించటమే కాకుండా మూఢత్వాన్ని పెంపొందించే ఆధ్యాత్మిక అంశాలను జోడించి తీసే సినిమాలు ప్రజలను పురాతన సనాతన భావాలవైపు తీసుకెళ్లి పతకానికి దారితీసేలా ఉంటున్నాయి. ఇవేవీకాకుండా సమాజానికి ఎంతోకొంత సందేశం ఇవ్వాలని శేఖర్ కమ్ముల భావించి ఈ సినిమా తీసినట్లుగా అనిపిస్తుంది.

**అంతరాలపైనా**

దేశంలోనూ, ప్రపంచంలోనూ సమాజంలోనూ తీవ్రమైన అసమానతలు కొనసాగుతున్నాయి. సరళీకృత ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత పేదలు మరింత పేదలవుతుండగా సంపన్నులు మరింత సంపన్నులుగా మారిపోతున్నారు. ఈ కుబేర సినిమాలో కూడా ఇలాంటి అంశాలు మనకు మచ్చుకు కనిపిస్తాయి. డబ్బున్నవాడు, డబ్బు లేని వాడు, పెట్టుబడిదారుడు, కార్మికుడు ఇలా భిన్నమైన వర్గాల మధ్య జరిగే ఘర్షణ, సంఘర్షణ, సంభాషణ, పరస్పర సంఘర్షణలు చాలా సినిమాల్లో ఇట్టే చూడొచ్చు. జైభీమ్, లక్కీభాస్కర్, మహర్షి, ఖైదీనంబర్ 150, సింగం వంటి సినిమాల్లో కార్పొరేట్ దోపిడీని పట్టిచూపించాయి.




వందేళ్ల సినిమా చరిత్రలో ప్రేక్షకుల అభిరుచిలో కూడా మార్పులొచ్చాయి. 1970 నుంచి 2000 వరకూ వచ్చిన మూస కథలకు ఇప్పుడు ఆదరణ ఉండటం లేదు. అందుకే శేఖర్ కమ్ముల సరికొత్త సబ్జెక్టును ఎన్నుకున్నారనిపిస్తుంది.

**మనీలాండరింగ్ చుట్టూనే**

అత్యంత ధనవంతుడు, ఏమీ ఆశించని బిచ్చగాడికి మధ్య జరిగే పోరాటమే 'కుబేర'. బిచ్చగాడి పాత్రలో ధనుష్ (దేవా) ఔట్ స్టాండింగ్ ఫెర్ఫార్మెన్స్ ఇచ్చారు. నాగార్జున (దీపక్), రష్మిక పాత్రలు సినిమాకు బలం. శేఖర్ కమ్ముల దర్శకత్వం, ట్విస్టులు, ఎమోషనల్ సీన్లు ఆకట్టుకుం టాయి. డిఎస్‌పి సంగీతం సందర్భోచితంగా సాగింది. సినిమాటోగ్రఫీ, నిర్మాణ విలువలు బాగుతున్నాయి. కుబేర సినిమాలో మనీలాండరింగ్ అంశం చుట్టూ కథ తిరుగుతుంది. మనీలాండరింగ్ ఎలా జరుగుతుందో చూపించారు. ఇందులో రాజకీయ నాయకులు, బడా బ్యూరోక్రాట్లు, ఇతర వ్యక్తులు ఒక పథకంలో భాగస్వాములుగా ఉంటారు. ఈ పథకంలో డొల్ల కంపెనీలు, బినామీ లావాదేవీలు, ఇతర పద్ధతులను ఉపయోగించి అక్రమంగా సంపాదించిన డబ్బును మళ్ళిస్తారు. ఈ సినిమాలో ధనుష్ పాత్ర ఒక అమాయక వ్యక్తిగా కనిపిస్తుంది. అతను తెలియకుండానే మనీలాండరింగ్ స్కామ్‌లో చిక్కుకుంటాడు. నాగార్జున పాత్ర సిబిఐ ఆఫీసర్‌గా ఉండి, ఈ స్కామ్‌ను ఛేదించడానికి ప్రయత్నిస్తాడు. రష్మిక మందన్న పాత్ర కూడా ఈ కథలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మనీలాండరింగ్ నష్టాలను, రాజకీయ నాయకుల అవినీతి, సాధారణ ప్రజల జీవితాలపై దాని ప్రభావం ఎలా ఉంటుందనేది చక్కగా తెరకెక్కించారు. దీపక్ తాను చేసే ఒక కీలక ఆపరేషన్‌లో దేవా అనే బిచ్చగాడితో కలిసి పని చేయాల్సి వస్తుంది. అసలు దీపక్ ఎందుకు దేవాను ఎంచుకున్నాడు? వారిద్దరి ప్రయాణంలో ఎలాంటి మలుపులు చోటు చేసుకున్నాయి? అన్నది కథాంశం.

సారాంశం : శేఖర్ కమ్ముల తాను చెప్పదలచుకున్న కథాంశాన్ని చాలా సూటిగా, స్పష్టంగా తెరకెక్కించారు. సినిమా ప్రారంభంలోనే కథ సారాంశం అర్థమవుతుంది. దాదాపు రెండున్నర గంటల నిడివి ఉన్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆసక్తిగా చూసేలా చేయడంలో దర్శకుడు కొంతవరకు విజయం సాధించారు. ధనుష్ నటన ఈ సినిమాకు ప్రాణం పోసిందని చెప్పొచ్చు. బిచ్చగాడి పాత్రలో ఆయన పరకాయ ప్రవేశం చేసి, తన కెరీర్‌లో మరొక అద్భుతమైన ప్రదర్శనను ఇచ్చారు.

**బిజెపి పాలనలో పరిస్థితులకు దర్పణం**

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మనీలాండరింగ్ కేసులు బాగా పెరిగాయి. బడాకార్పొరేట్లు, మిలీనియర్లు మరింతగా రెచ్చిపోతున్నారు. మతోన్మాద, మూక దాడులు పెరిగాయి. ఈ క్రమంలో అభ్యుదయ భావాలతో తీసే సినిమాలపై కేంద్రం తన అధికారాన్ని ఉపయోగించుకుని సెన్సారు బోర్డు ద్వారా కొరడా ఝుళిపిస్తోంది. జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ అనే సినిమాలో 'జానకి' అనే పేరును మారిస్తేనే రిలీజ్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్‌బోర్డు షరతులు పెట్టడం ఇలాంటి చర్యల్లో భాగమే. మతోన్మాదుల నుంచి అభ్యంతరాలు వచ్చాయనేది అభియోగం. 2017-2018లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన చిత్రం 'పద్మావత్'. కర్ణిసేన నుంచి అభ్యంతరాలు వచ్చాయనే పేరుతో పలు సీన్లకు కత్తెర వేశారు. చివరకు పద్మావతి సినిమా కాస్తా పద్మావత్‌గా మార్చాల్చివచ్చింది. మలయాళంలో 2017లో సెక్సీ దుర్గా పేరుతో తెరకెక్కిన సినిమాకు ఎస్.దుర్గగా మార్చాల్సివచ్చింది. అక్షరుకుమార్ లీడ్‌రోల్‌లో లారెన్స్ కాంచన రీమేక్‌గా 2020లో రిలీజ్ అయిన సినిమా లక్ష్మీబాంబ్‌గా తొలుత టైటిల్ ఫిక్స్ చేయగా హిందూ సంఘాల అభ్యంతరాలతో లక్ష్మీగా మార్చేశారు. 2013లో సంజరులీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన రామ్-లీలా అభ్యంతరాల తర్వాత గోలియోన్ కీ రాస్‌లీలా రామ్-లీలాగా టైటిల్ మార్చేశారు. 2024లో మమ్ముట్టి నటించిన 'భ్రమయుగం' పేరుతో విడుదలకు ముందే కొడుమోన్ పోట్టిగా మార్చాల్సివచ్చింది. ఇవే కాకుండా కంగనా రనౌత్ తలైవి, అనుష్క రుద్రమదేవి, రిషబ్‌శెట్టి కాంతార వంటి సినిమాలకు సైతం అభ్యంతరాలు వచ్చిన విషయం తెలిసిందే



# అల్కరాస్‌కు ఎదురుందా?

**- బరిలో సినర్, నొవాక్ జకోవిచ్**
**- నేటి నుంచి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్**

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ మహా సమరం అభిమానుల మదిలో మెదులుతుండగానే.. మరో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ సోమవారం నుంచి ఆరంభం కానుంది. డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుండగా.. వరల్డ్ నెం.1 జానిక్ సినర్ (ఇటలీ), నొవాక్ జకోవిచ్ (సెర్బియా) అతడికి గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. లండన్ (ఇంగ్లాండ్) : ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌కు రంగం సిద్ధమైంది. రెండు సార్లు డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) ఆల్ ఇంగ్లాండ్ సెంటర్ కోర్టులో హ్యాట్రిక్ టైటిల్‌పై కన్నేసి బరిలోకి దిగుతున్నాడు. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో మ్యాచ్ పాయింట్‌ను కాచుకుని జానిక్ సినర్‌కు ఊహించని షాక్ ఇచ్చిన అల్కరాస్.. వింబుల్డన్‌లోనూ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నాడు. పచ్చిక కోర్టుపై అల్కరాస్ వేగం, సుదీర్ఘ ర్యాలీలు, బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లు సహా సూపర్ సర్వ్‌ను ఎదుర్కొని నిలబడటం ప్రత్యర్థులకు కఠిన సవాల్‌గా నిలువనుంది. సోమవారం తొలి రౌండ్ మ్యాచ్‌లో ఇటలీ ఆటగాడు ఫాబియో ఫోగ్నినితో కార్లోస్ అల్కరాస్ తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నెం.1 అరినా సబలెంక (బెలారస్), ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ కొకొ గాఫ్ సహా ఇంగ్లాండ్ స్టార్ ఎమ్మా రెడాకాను టైటిల్ వేటలో ఫేవరేట్లుగా కనిపిస్తున్నారు. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ నేటి నుంచి ఆరంభం కానుండగా.. తొలిరోజే కీలక ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కరాస్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ నేడు రాకెట్ పట్టనున్నారు. రష్యా స్టార్ ఆటగాడు డానిల్ మెద్వదేవ్, అమెరికా ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్, రూనె, బెరెటాని, ఒలీవర్, స్టెఫానోస్ సిట్సిపాస్‌లు నేడు తొలి రౌండ్లో ఆడనున్నారు. మహిళల సింగిల్స్‌లో అరినా సబలెంక, ఫెర్నాండెజ్, ఎలినా స్విటొలినా, ఒస్టాపెంకో, మడిసన్ కీస్, జాస్మిన్ పావొలిని, ఎమ్మా రెడుకానులు తొలి రౌండ్లో ఆడనున్నారు. వింబుల్డన్ మ్యాచులు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆరంభం అవుతాయి. భారత్‌లో స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్ వింబుల్డన్ మ్యాచులను ప్రసారం చేస్తుంది.



# సెమీస్‌లో నిఖత్ జరీన్

**- జాతీయ బాక్సింగ్ ఛాంపియన్**

**హైదరాబాద్** : హైదరాబాద్ వేదికగా జరుగుతున్న జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. 51 కేజీల విభాగంలో పోటీపడిన నిఖత్ జరీన్ 5-0తో కల్పన (శారు)పై ఏకపక్ష విజయం సాధించింది. యూత్ వరల్డ్ మాజీ చాంపియన్ అంకుషిత బోరో 65 కేజీల విభాగంలో 5-0తో రాజస్థాన్ బాక్సర్‌ను చిత్తు చేసి సెమీఫైనల్లో ప్రవేశించింది. 48 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ మహి వజీర్ 0-5తో మంజు రాణి చేతిలో ఓటమి చెందింది. 54 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిరుపమ 0-5తో పరాజయం పాలైంది.



# మంధాన రికార్డు సెంచరీ

**-తొలి టి20లో ఇంగ్లండ్‌పై 93పరుగుల తేడాతో గెలుపు**

నాటింగ్‌హామ్: టి20ల్లో భారత కెప్టెన్ స్మృతి మంధాన రికార్డు శతకంతో చెలరేగింది. దీంతో నాటింగ్‌హామ్ వేదికగా ఇంగ్లండ్ మహిళలతో జరిగిన తొలి టి20లో భారతజట్టు 97పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 14.5ఓవర్లలో 113 పరుగులకే పరిమితం చేసి ఈ ఫార్మాట్‌లో ఇంగ్లండ్‌పై భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్‌కు దూరం కాగా.. పగ్గాలు అందుకున్న స్మృతి మంధాన టి20ల్లో తొలి సెంచరీతోపాటు ఓవరాల్‌గా 62బంతుల్లో 15ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 112 పరుగులు చేసి ఎక్లేస్టోన్ బౌలింగ్‌లో స్కీవర్ బ్రంట్ క్యాచ్ అందుకోవడంతో పెవీలియన్‌కు చేరింది. అంతకు ముందు ఓపెనర్ షెఫాలీ వర్మ(20)తో కలిసి మంధాన 8.3ఓవర్లలో 77పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత షెఫాలీ ఔటైనా.. హర్లీన్ డియోల్‌తో కలిసి మరో 96పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియా భారీస్కోర్ కు బాటలు వేసింది. లారెన్ బౌలింగ్‌లో రెండు ఫోర్లలో సెంచరీ పూర్తి చేసుకున్నారు. ధాటిగా ఆడే క్రమంలో రీచా ఘోష్(12), రోడ్రిగ్స్(0) ఔట య్యారు.



ఇంగ్లండ్ బౌలర్లు లారెన్ బెల్‌కు మూడు, అర్లాట్, ఎక్లేస్టోన్‌కు ఒక్కోవికెట్ దక్కాయి. భారీ లక్ష్యాన్ని ఛేదిం చేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టును శ్రీఛరాని(4/12), దీప్తి శర్మ(2/32) కట్టడి చేశారు. దీంతో ఇంగ్లండ్ మహిళల జట్టు 14.5ఓవర్లలో 113పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ కెప్టెన్ స్కీవర్ బ్రంట్(66) మినహా.. మిగిలిన ఏ ఒక్క బ్యాటరూ రాణించలేక పోయారు. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలువగా.. రెండో టి20 మంగళవారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ స్మృతి మంధానకు దక్కింది. **స్కోర్‌బోర్డు:** భారత మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (సి)ఎక్లేస్టోన్ (బి)అర్లాట్ 20, మంధాన (సి)స్కీవర్ బ్రంట్ (బి)ఎక్లేస్టోన్ 112, హర్లిన్ డియోల్ (సి)అర్లాట్ (బి)లారెన్ బెల్ 43, రీచా ఘోష్ (సి)సోఫీ డొంకీ (బి)లారెన్ బెల్ 12, రోడ్రిగ్స్ (సి)స్కీవర్ బ్రంట్ (బి)లారెన్ బెల్ 0, అమన్‌జ్యోత్ కౌర్ (నాటౌట్) 3, దీప్తి శర్మ (నాటౌట్) 7, అదనం 13. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 210 పరుగులు. వికెట్ల పతనం: 1/77, 2/171, 3/186, 4/190, 5/202 బౌలింగ్: లారెన్ బెల్ 4-0-27-3, అర్లాట్ 4-0-38-1, లారెన్ ఫిలెర్ 4-0-35-0, స్మిత్ 3-0-41-0, ఎక్లేస్టోన్ 3-0-43-1, క్యాప్సే 2-0-21-0.

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: డోంక్లే (సి)రీచా (బి)అమన్‌జ్యోత్ 7, వాట్ (సి)హర్లిన్ (బి)దీప్తి 0, స్కీవర్ బ్రంట్ (సి)రీచా (బి)శ్రీచరాణి 66, బ్యూమౌంట్ (బి)దీప్తి శర్మ 10, అమీ జోన్స్ (స్టంప్)రీచా (బి)రాధా యాదవ్ 1, అలైసే కాప్సే (సి)అరుంధతి రెడ్డి (బి)శ్రీచరాణి 5, అర్లోట్ (సి)మంధాన (బి)రాధా యాదవ్ 12, ఎక్లేస్టోన్ (సి)రోడ్రిగ్స్ (బి)శ్రీచరాణి 1, ఫిలెర్ (సి)రీచా (బి)అరుంధతి 2, స్మిత్ (నాటౌట్) 0, బెల్ (సి)రోడ్రిగ్స్ (బి)శ్రీచరాణి 2, అదనం 7. (14.5ఓవర్లలో ఆలౌట్) 113పరుగులు. వికెట్ల పతనం: 1/9, 2/9, 3/58, 4/62, 5/70, 6/88, 7/102, 8/111, 9/111, 10/113 బౌలింగ్: అమన్‌జ్యోత్ కౌర్ 2-0-22-1, దీప్తి శర్మ 3-0-32-2, శ్రీచరాణి 3.5-0-12-4, అరుంధతి రెడ్డి 2-0-18-1, రాధా యాదవ్ 2-0-15-2, స్నే రాణా 2-0-13-0.

# ఇదేం కౌన్సెలింగ్..?



- వైద్య ఆరోగ్య శాఖలో విచిత్రం
- కౌన్సెలింగ్ అంటూ ఊరించి చివరకు జూమ్ కౌన్సెలింగ్ అంటూ ప్రకటన
- అనంతపురం డీ.ఎం.హెచ్.ఓ ప్రకటనపై భగ్గుమంటున్న సచివాలయ ఏ.ఎన్.ఎం
- జూమ్ కౌన్సెలింగ్ ను బహిష్కరించే యోచనలో ఆరోగ్య కార్యకర్తలు
- కలెక్టర్ జోక్యం చేసుకొని నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 29 :** గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రభుత్వ ప్రతిష్టను ఇప్పటికే దిగజార్చింది. సోమవారం నుంచి నిర్వహించాల్సిన సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు బి3 బదిలీల కౌన్సెలింగ్ నేపథ్యంలో ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత అనంతపురం వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఈబీ దేవి విడుదల చేసిన జూమ్ కౌన్సెలింగ్ ప్రకటనపై సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు – 3 భగ్గుమంటున్నారు. నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించకుండా..జూమ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఆరోగ్య కార్యకర్తలు ఆయా పీ.హెచ్.సీ వైద్యుల సమక్షంలో జూమ్ కౌన్సెలింగ్ కు హాజరు కావాలని ప్రకటించడాన్ని తప్పుబడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు నేరుగా కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే బదిలీలు చేపట్టాలని ఆదేశించగా..అన్ని శాఖలు అలాగే చేస్తే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం జూమ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని మండిపడుతున్నారు. తమకు అనుకూలమైన వారి కోసమే జూమ్ కౌన్సెలింగ్ కు మొగ్గు చూపినట్లు ఆరోపించారు. జూమ్ కౌన్సెలింగ్ ను తాము వ్యతిరేకిస్తున్నామని, నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అనంతపురం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ చొరవ తీసుకొని జూమ్ కౌన్సెలింగ్ ను రద్దు చేసి, నేరుగా కౌన్సెలింగ్ చేపట్టేలా ఆదేశించాలని సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు కోరారు.

## జనసేనలోకి ధర్మాన

**శ్రీకాకుళం– సూర్య వాస్తవం**



జిల్లా కేంద్రం శ్రీకాకుళం నియోజక వర్గంలో సంక్లిష్ట రాజకీయ పరిస్థితులు ఉంటాయి. అక్కడ తెలుగుదేశం పార్టీకి పట్టు ఎక్కువ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటే తన కుమారుడి రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బందికరమని... ఆ వైసీపీ సీనియర్ జనసేనలో చేరుతారా? కుమారుడి భవిష్యత్తు కోసం కీలక నిర్ణయం తీసుకోనున్నారా? వైయస్సార్ కాంగ్రెస్ ఏమంత శ్రేయస్కరం కాదని భావిస్తున్నారా? భవిష్యత్తు అంచనాకు వచ్చారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంతకీ ఎవరా నేత? ఏంటా కథ? అంటే ఏపీలో సీనియర్ మోస్ట్ పొలిటీషియన్ ధర్మాన ప్రసాదరావు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన ఏమంత యాక్టివ్ గా లేరు. పార్టీ కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం లేదు. గత కొద్ది రోజులుగా ఊగిసలాటలో ఉన్నారు. తాజాగా ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ పార్టీలోసుదీర్ఘకాలం పనిచేశారు ధర్మాన ప్రసాదరావు. 1989 ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. చిన్న వయసులోనే మంత్రి పదవి అందుకున్నారు. అటు తరువాత 2004లో వైయస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్లో కీలక మంత్రి పదవి అందుకున్నారు. 2014 వరకు పదేళ్ల పాటు ఉమ్మడి ఏపీలో మంత్రి పదవిలో కొనసాగారు. జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయగా దానిని తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ తరపున మూడుసార్లు పోటీ చేసి ఒకసారి మాత్రమే గెలిచారు. మొన్నటి ఎన్నికల్లో టిడిపి ఓ సాధారణ అభ్యర్థిని పెట్టగా.. ఆయన చేతిలో ఘోరంగా ఓడిపోయారు. 52 వేల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు.జిల్లా కేంద్రం శ్రీకాకుళంనియోజకవర్గంలో సంక్లిష్ట రాజకీయ పరిస్థితులు ఉంటాయి. అక్కడ తెలుగుదేశం పార్టీకి పట్టు ఎక్కువ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటే తన కుమారుడి రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బందికరమని ధర్మాన ప్రసాదరావు భావిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో కుమార్ రెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇప్పించేందుకు ప్రయత్నించారు. జగన్ నిరాకరించడంతో అయిష్టంగానే పోటీ చేశారు. కానీ దారుణ పరాజయం ఎదురయింది. అప్పటినుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.ఇప్పుడు జనసేన నాయకత్వం నుంచి ఆయనకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు ప్రచారం సాగుతోంది. కుమార్ రెడ్డితో సహా ఆయన జనసేనలోకి వెళ్తారని టాక్ నడుస్తోంది. కూటమి ప్రభుత్వంలో ధర్మాన ప్రసాదరావు పెద్దరికానికి గౌరవం లభించేలా ఒప్పందం జరిగినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో పొత్తులో భాగంగా ధర్మాన ప్రసాదరావు కుమారుడికి ఏదో ఒకచోట సర్దుబాటు చేస్తారని తెలుస్తోంది. ఒకవేళ ధర్మాన ప్రసాదరావు పార్టీ మారితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో నూకలు చెల్లినట్టే. అయితే ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ధర్మాన ప్రసాదరావు సోదరుడు కృష్ణదాస్ ఉన్నారు. ఆయన మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# నల్లగా మారుతున్న సముద్రం...

**విశాఖపట్టణం – సూర్య వాస్తవం**



ముఖ్యంగా ఆర్కే బీచ్ లో కోస్టల్ బ్యాటరీ నుంచి నో వాటర్ హోటల్ ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ పార్క్ వరకు ఇసుక తిన్నెలు నల్లగా మారిపోయాయి. దీంతో విశాఖకు ఏమయింది అంటూ ఎక్కువమంది చర్చించుకుంటున్నారు. రకరకాల అంశాలు తెరపైకి వస్తున్నాయి. విశాఖ తీర ప్రాంతంలో వింత పరిస్థితి కనిపిస్తోంది. తీరంలో ఉన్న ఇసుక ఒక్కసారిగా రంగు మారుతోంది. నల్లగా మారుతుండడంతో పర్యాటకులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద ఎత్తున వ్యర్థాలు, కాలుష్యం కారణంగా ఇలా రంగు మారిందన్న అనుమానాలు ఉన్నాయి. మరోవైపు వాతావరణం లో మార్పులు వల్ల కూడా ఇసుక నల్లగా మారింది అంటున్నారు. గతంలో కూడా విశాఖ తీరంలో ఇసుక రంగు మారిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆర్కే బీచ్ లో కోస్టల్ బ్యాటరీ నుంచి నో వాటర్ హోటల్ ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ పార్క్ వరకు ఇసుక తిన్నెలు నల్లగా మారిపోయాయి. దీంతో విశాఖకు ఏమయింది అంటూ ఎక్కువమంది చర్చించుకుంటున్నారు. రకరకాల అంశాలు తెరపైకి వస్తున్నాయి. విశాఖను రాజధానిగా ప్రకటించి.. శాపాన్ని మూటగట్టుకునేలా చేస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.అయితే విశాఖ తీరంలో ఇసుక రంగు మారడానికి వ్యర్థాలు నీటిలో కలవడమే ప్రధాన కారణం అన్న టాక్ వినిపిస్తోంది. కానీ నిపుణులు మాత్రం అది కాదంటున్నారు. ఇసుకలో ఉండే లైట్, హెవీ మినరల్స్ విడిపోవడం వల్లే తీరం నల్లగా మారిందని చెబుతున్నారు. వాతావరణ మార్పుల వల్ల అలల ఉధృతి పెరిగినప్పుడు తీరంలో ఉండే లైట్ మినరల్స్ నీటితో పాటు సముద్రం లోపలకు వెళ్లిపోతాయి. హెవీ మినరల్స్ తీరంలోనే ఉండిపోతాయి. బరువుగా ఉండే ఈ మినరల్స్ లో ఎక్కువగా ఇలమనైట్, రుటైల్, జింకాన్, గార్నెట్, సిలిమినైట్ వంటివి ఉంటాయి. బీచ్ నల్లగా మారడానికి ప్రధానంగా ఇలమనైట్, రుటైల్ వంటి హెవీ మినరల్స్ కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ రెండు నల్లగా ఉండడం వల్లే తీరమంతా ఆ రంగులోకి మారుతుంది అంటున్నారు.తీరంలో అలల తాకిడి ఎక్కడ అధికంగా ఉంటుందో అక్కడే ఇలాంటి పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. రెండు రోజులుగా వాతావరణం లో మార్పులు వచ్చాయి. దీంతో అలల ఉధృతి కూడా పెరిగింది. ఈ కారణంగానే తీరంలో హెవీ మినరల్స్, లైట్ మినరల్స్ విడిపోయి ఇసుక తిన్నెలు నల్లగా మారుతున్నాయని అనుమానాలు ఉన్నాయి.. అయితే బీచ్ లో ఇసుక రంగు నల్లగా మారడంతో పర్యాటకులతో పాటు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకునే ఈ ప్రాంతం ఇలా కావడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. మరోవైపు రాజధానిగా ఎంపిక చేసిన నగరం ఇలా మారిందేంటి అని సోషల్ మీడియాలో సైతం ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. ఇదో వైరల్ అంశంగా కూడా మారిపోయింది ఒకప్పుడు రాష్ట్ర రాజధాని అని గర్వంగా చెప్పుకు బతికేటోళ్లు ఈరోజు ఇంస్టాగ్రామ్, యూట్యూబ్ అంత యోగా మ్యాట్లు దొబ్బేసుకుపోయినోళ్లు అని ట్రోల్ అవుతున్నారు.

# మారనున్న రేణిగుంట విమానశ్రయం పేరు

**తిరుమల – సూర్య వాస్తవం**



తిరుపతిలోని రేణిగుంట విమానాశ్రయం పేరు మారబోతుందా? అంటే నిజమనిపిస్తుంది. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పేరు సిఫార్సు చేస్తూ.. కేంద్రానికి లేఖ పంపింది. ఇక నుంచి రేణిగుంటను శ్రీ వేంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు మార్చడంపై టీటీడీ ప్రయత్నిస్తోంది. ఈ మేరకు టీటీడీ బోర్డు చర్చించి తీర్మానం చేసింది. కేంద్ర పై ఒత్తిడికి ప్రయత్నిస్తోంది.తిరుమలకు ఐకానిక్‌గా విమానాశ్రయానికి ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చేందుకు కేంద్ర విమానయాన శాఖకు టీటీడీ సిఫార్సు చేసింది. తిరుమల అన్నమయ్య భవన్‌లో జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చైర్మన్ బీ.ఆర్.నాయుడు తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి వివరించారు. కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంల అభ్యర్థన మేరకు బెంగుళూరులోని ముఖ్యమైన ప్రాంతంలో శ్రీవారి ఆలయం నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ ఛైర్మన్ తెలిపారు. ఇందుకు కావాల్సిన 47 ఎకరాల స్థలాన్ని కర్ణాటక ప్రభుత్వం కేటాయించగానే ఆలయ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డీ.కుమార స్వామి కేంద్ర ప్రభుత్వం నుండి టీటీడీకి 100 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించేందుకు ముందుకు వచ్చారన్నారు. త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తెచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు.ఇక కేంద్ర ప్రభుత్వం తిరుపతిలో ఏర్పాటు చేయనున్న సీఎస్ఐఆర్ ల్యాబ్‌కు లీజు పద్ధతిలో టీటీడీ స్థలాన్ని కేటాయించాలని టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. తద్వారా టీటీడీ వినియోగించే నెయ్యి, నీరు, ఆహార పదార్థాల నాణ్యతను ఉచితంగా తనిఖీ చేసేందుకు అవకాశం ఉంటుందని బీఆర్ నాయుడు వెల్లడించారు.న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక టీటీడీ కళాశాలను ఆధునీకరించాలని నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ చైర్మన్ చెప్పారు. టీటీడీ పరిధిలోని కాలేజీ లెక్చరర్ పోస్టుల భర్తీని నిలిపి వేయాలని ఏపీపీఎస్సీకి సిఫార్సు చేశామన్నారు.

ఇప్పటికే పని చేస్తున్న 200 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించార న్నారు. ఈ మేరకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశామన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ సహకారంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న అర్చకుల శిక్షణా కార్యక్రమంతో పాటు వివిధ వ్రతాలు, పూజా విధానాలలో కూడా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. విద్యార్థుల్లో హైందవ సనాతన ధర్మం నేర్పించి, మానవీయ విలువలను, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వడానికి సద్గమయ కార్యక్రమాన్ని టీటీడీకి చెందిన 7 పాఠశాలల్లోని దాదాపు 1,600 మంది విద్యార్థులకు డే స్కాలర్ విధానంలో శిక్షణ ఇస్తామన్నారు.టీటీడీ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు హిందూ సనాతన ధార్మిక విలువలతో పాటు తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా మన వారసత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ బీ.ఆర్. నాయుడు తెలిపారు. వరలక్ష్మీ వ్రతం పర్వదినాన తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో సౌభాగ్యం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నా మన్నారు.అదేవిధంగా అక్షర గోవిందం, హరికథా వైభవం, భగవద్గీత అనుష్టాన బోధన, భజే శ్రీనివాసం, వన–నిధి, గిరి జనార్దనం, సన్మార్గం వంటి కార్యక్రమాలను నిర్వహించి జన బాహుళ్యంలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చర్యలు చెందుతున్నట్లు చెప్పారు.

# తోతాపురి మామిడి పంచాయితీ...

**తిరుపతి– సూర్య వాస్తవం**



తోతాపురి ' మామిడి పండు.. 'హ' షేపులో ఆకర్షణీయం గా ఉండే ఈ రకం మామిడిని "కలెక్టర్ మామిడి " అని ఆంధ్రా ప్రాతంలో పిలుస్తారు. నార్త్‌లో బాగా ఫేమస్ అయిన ఈ పండు ఏపీలో రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరులో ఎక్కువగా సాగులో ఉంది. ఆంధ్రా ప్రాంతంలో దీన్ని పెద్దగా తినరు. అక్కడ ఎక్కువగా బంగినపల్లి, రసాలు, పంచదార కల్తీ, పండూరు రకాలకు డిమాండ్. అయితే "కలెక్టర్ కాయ' రకం మామిడిని మ్యాంగో పల్ప్ (గుజ్జు ) తయారు చేయడంలో ఎక్కువగా వాడతారు. ఎక్కువకాలం నిలువ ఉండడంతపాటు గుజ్జు ఎక్కువగా ఉండడంతో 'తోతాపురి "ని ప్రాసెస్ చేసి ఎక్స్పోర్ట్ చేస్తూ ఉంటారు. అయితే ఇప్పుడు ఈ "తోతాపురి" మామిడి ఏకంగా మూడు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది. ఆంధ్రా, కర్ణాటకతోపాటు తమిళనాడు మామిడి రైతులు, ప్రాసెసింగ్ వ్యాపారుల మధ్య ఇది వివాదం రేపింది. చివరకు ఇతర రాష్ట్రాల నుంచి ఏపీకి " తోతాపురి " మామిడి దిగుమతులను అధికారుల నిషేదించడంతో ఇది ప్రభుత్వాల స్థాయిలో వివాదం రేపే స్థాయికి చేరిపోయింది.ఏపీలోని కృష్ణా జిల్లాతో సమానంగా మామిడి సాగులో పోటీ పడేది చిత్తూరు జిల్లా. చిత్తూరు జిల్లాలో మామిడి గుజ్జు తీసి ఎగుమతి చేసే పరిశ్రమలు 47 ఉన్నాయి. వీటిలో చాలా వరకూ 2014–19 మధ్య కాలం లో తెరిచినవే. ఈ సీజన్‌లో వాటిలో 16 పరిశ్రమలను ఓపెన్ చేసి మామిడి గుజ్జు తయారుచేస్తున్నారు. దీనికోసం జిల్లా రైతుల నుంచి మామిడి పళ్ళను సేకరించడం మొదలు పెట్టారు. అయితే రైతులు కేజీ "తోతాపురి' మామిడి పళ్లకి కనీసం 12 రూపాయల మద్దతు ధర డిమాండ్ డిమాండ్ చేయడంతో ప్రభుత్వం వారికి పరిశ్రమలు 8 రూపాయలు ప్రభుత్వం తరపున 4 రూపాయలు కలిపి 12 రూపాయలు అందేలా నిర్ణయం తీసుకుంది. దీనిపై మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు అడ్డు చెప్పారు. ఓపెన్ మార్కెట్ లో "తోతా పురి " మామిడి రేటు కేజీ 5 రూపాయల కంటే ఎక్కువ లేదు. అలాంటప్పుడు తాము 8 రూపాయల చొప్పున ఎందుకు ఇవ్వాలనేది వారి అభ్యంతరం. పైపెచ్చు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉండే "గుడిపాల " మండలం ద్వారా ఏపీలోకి పక్క రాష్ట్రాల రైతులు తమ మామిడిపండ్లను తక్కువ రేటుకే చిత్తూరులోని పరిశ్రమలకు తరలిస్తున్నారు. దీనికి చిత్తూరు జిల్లా మామిడి రైతులు అడ్డు చెప్పడంతో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా లోని పరిశ్రమ లు వేరే రాష్ట్రాల నుంచి మామిడి కొనకుండా పరిశ్రమలను ఆదేశించారు. పైగా షిఫ్టింగ్ పద్దతిలో పరిశ్రమల వద్ద ఉద్యోగులకు డ్యూటీ లు వేసి మామిడి పళ్ళని అమ్మడానికి వచ్చే రైతుల ఆధార్ కార్డులు, పాస్ బుక్ జిరాక్స్ లు, ఈ క్రాప్ బుకింగ్ వివరాలు, రాయితీ నమోదు వివరాలు చెక్ చేస్తున్నారు. స్థానిక రైతుల మంచి కోసమే ఈ ఆంక్షలు తెచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.అయితే ఈ పరిణామంపై పక్క రాష్ట్రాలైన తమిళనాడు కర్ణాటక అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఈ నిర్ణయంపై మరోసారి ఆలోచించాలని ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఇతర జిల్లాల్లో లేని ఆంక్షలు ఒక్క చిత్తూరులోని ఎందుకు అని ఆయన లేఖలో అడిగారు. ఇక కర్ణాటక చీఫ్ సెక్రటరీ శాలిని రాజనీష్ కూడా ఏపీ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తూ నిర్ణయం " చిరకాల సెంటిమెంట్" లను దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నట్టు తెలుస్తోంది. కోలార్ లోని మూడు గుజ్జు పరిశ్రమలు, తుముకూరు దగ్గర మరో పరిశ్రమ తెరవని కారణం వల్లనే వారు చిత్తూరు జిల్లాలోని గుజ్జు పరిశ్రమలకు తమ మామిడిపళ్ళను పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో అలా పక్క రాష్ట్రం నుంచి వచ్చే మామిడిపండ్లపై బ్యాన్ విధించడం తో అక్కడ వివాదం రాజుకుంది. ఏషియాలోనే అతిపెద్ద టమాట మార్కెట్ లు తమిళనాడులోని కోయంబేడు, చిత్తూరులోని మదనపల్లి, కర్ణాటకలోని కోలార్ లలో ఉన్నాయి. ఇప్పుడు ఇలా పక్క రాష్ట్రం నుంచి వచ్చే మామిడి పళ్ళపై చిత్తూరు జిల్లాలో బ్యాన్ విధిస్తే రేపు దీని ప్రభావం జిల్లాలోని టమాట రైతులపై పడే ప్రభావం ఉందని వ్యాపారులు గుర్తు చేస్తున్నారు. మరి ఈ వివాదం రానున్న రోజుల్లో మరెన్ని పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )